J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 20.03.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 42 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# కరోనాతో.. జాగ్రత్త

## వైరస్ వలయంలో ప్రపంచం



- జనతా కర్ఫ్యూ పాటించాలని ప్రజలకు ప్రధాని పిలుపు
- దేశవ్యాప్తంగా హెల్త్ ఎమర్జెన్సీ విధింపు
- 29వరకు అంతర్జాతీయ సరిహద్దులు మూసివేత
- చరిత్రలో తొలిసారిగా తిరుమలలో దర్శనాలు నిలిపివేత

తుఫాన్‌లు... పరిమిత ప్రాంతం పైనే ప్రభావం చూపిస్తాయి. వరదలు... కొన్ని గ్రామాలను ముంచెత్తుతాయి. భూకంపాలు... కొంత ప్రాంతాన్ని మాత్రమే కుదిపేస్తాయి... సునామీ... కొన్ని దేశ తీరాలను మాత్రమే తాకుతుంది. కానీ వైరస్... భూగోళాన్ని చుట్టేస్తుంది. కోట్లాది మందిని పట్టేస్తుంది. ప్రపంచాన్నే కుప్పకూల్చేస్తుంది. ప్రస్తుతం కరోనా వైరస్ ఆ పనే చేస్తోంది. చరిత్రలో ఇప్పటివరకు తలెత్తిన విపత్తులలో అత్యంత పెనువిపత్తుగా పరిణమిస్తోంది. అణు యుద్ధాల కంటే, ప్రపంచయుద్ధాలకంటే ప్రమాదకారిగా మారుతోంది.

(మిగతా 11వ పేజీలో)

- కంటికి కనిపించని సూక్ష్మజీవి భూగోళాన్ని షేక్ చేస్తోంది
- 195 దేశాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నాయి
- భారతదేశంలోనూ మోగిన ప్రమాద ఘంటికలు
- ముందు జాగ్రత్తలు పాటించి మనల్ని మనమే రక్షించుకుందాం




## బాబు డైరెక్షన్...

# వాయిదా పడ్డ ఎలక్షన్



- వైసిపి జోరుకు కోవిడ్ బ్రేక్
- వైరస్ సాకుతో ఎన్నికలు వాయిదా వేసిన కమిషనర్
- ఈసిపై సీఎం ఫైర్
- 5వేల కోట్ల నిధులు ఆగిపోతాయని ఆందోళన
- ఎన్నికల వాయిదాను అడ్డుకోని సర్వోన్నత న్యాయస్థానం

కరోనా వైరస్... దీన్ని చూసి ఇప్పుడు ప్రపంచమంతా భయపడుతోంది. దాని దెబ్బకు అగ్రదేశం, పేద దేశం అన్న తేడా లేకుండా అన్ని దేశాలు వణుకుతున్నాయి. లక్షల కోట్లకు పడగలెత్తినవాళ్ళే కాదు కూటికి గతిలేని పేదోళ్ళు కూడా దాని ప్రభావానికి లోనై అన్నీ మానుకుని ఇళ్ళల్లో కూర్చుంటున్నారు.

అయితే, ప్రపంచమంతా ఒకెత్తు... ఈ ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ అనే రాష్ట్రం, ఆ రాష్ట్రంలోని రాజకీయం మరో ఎత్తు. అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బు బిల్ల.. కాదేదీ కవితకు అనర్హం అని మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు... కరోనా వైరస్‌ను కూడా ఏపిలో రాజకీయ నాయకులు తమ రాజకీయ చట్రబంధంలో ఇరికించేసి వాడుకుంటున్నారు. కరోనా వైరస్‌ను కారణంగా చూపుతూ రాష్ట్రంలో జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను ఆరువారాల పాటు వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయం రాష్ట్ర రాజకీయాలలో కరోనా వైరస్‌ను మించిన రాజకీయ కలకలాన్ని రేపింది. స్థానిక ఎన్నికల

(మిగతా 11వ పేజీలో)





సింహపురి సమాచారం

# దేవుళ్ళనూ వదలని వైరస్!

**కులం మాట లేదు... మతం చూడలేదు... వర్ణం చూడలేదు... వర్గం చూడలేదు... పేద దేశం, ధనిక దేశం అన్న తేడా లేదు... దేవుడు చూపులోనైనా పక్షపాతం వుంటుందేమోగాని తన చూపులో ఎలాంటి పక్షపాతం లేదని చాటుకుంది కరోనా వైరస్. తన దృష్టిలో అందరూ సమానమేనని చాటి చెప్పింది. అంతేకాదు, మనుషులు, దేవుళ్ళు కూడా తన దృష్టిలో ఒకటేనని చెబుతోంది.**

కరోనా వైరస్ దేవుళ్ళను కూడా వదిలిపెట్టడం లేదు. ఇంతకుముందు గ్రహణాల సమయంలోనే ఆలయాలను మూసేవాళ్ళు, ఇప్పుడు కరోనా వైరస్ దెబ్బకు పలు దేవాలయాలలో భక్తుల దర్శనాలను నిలిపేస్తున్నారు, కొన్ని దేవాలయాలైతే మూసేస్తున్న పరిస్థితి.

ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో శ్రీరామనవమి పండుగ నుండి తిరునాళ్ళు మొదలవుతాయి. ఈ నెలలో జరిగిన తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవానికే అధికారులు ఆంక్షలు విధించడం తెలిసిందే! చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు

## తిరునాళ్ళు జరిగేనా?

ముత్యాలమ్మ జాతరకైతే భక్తులు లక్షల్లో వస్తారు. కాని ఈ సంవత్సరం ఆ గ్రామస్తుల వరకే జాతరను పరిమితం చేశారు. ఇటీవల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జాతర చాలా సాదాసీదాగా జరిగింది.

ఇక ఈ నెలాఖరు నుండి ఏప్రిల్, మే నెల వరకు పెంచలకోన బ్రహ్మోత్సవాలున్నాయి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ళున్నాయి, బుచ్చిరెడ్డిపాలెం శ్రీ కోదండరామస్వామి తిరునాళ్ళు, వింజమూరు చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు, నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఉత్సవాలు... రాబోయే రెండు నెలలు తిరునాళ్ళ సీజనే!

అయితే ప్రస్తుతం నెలకొన్న కరోనా వైరస్ ప్రమాదకర వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించడం అంత కరెక్ట్ కాదు. కొన్ని వేలు, లక్షల మంది గుమికూడే చోట ఒక్క మనిషికి వైరస్ వున్నా కొన్ని వందలు, వేలమందికి క్షణాలలో వ్యాప్తి చెందడానికి అవకాశముంటుంది. కాబట్టి వైరస్ పూర్తిస్థాయిలో అదుపులోకి వస్తే తప్పితే, లేదంటే ఈ సంవత్సరం ఆయా తిరునాళ్ళు సాదాసీదాగా జరుపుకోక తప్పదు.

---

### వాణిజ్య సముదాయాల్లో...

## శుభ్రత పాటించాలి

నెల్లూరు నగరంలోని వాణిజ్య సముదాయాల్లో శుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, కరోనా వైరస్‌ను నియంత్రించే సోడియం హైపో క్లోరైడ్‌ను తరచూ పిచికారి చేయాలని నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి సూచించారు. ఈనెల 17న వారు నగరంలోని మాల్స్, థియేటర్లు, ఇతర వాణిజ్య సముదాయాల యాజమాన్యాలతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోకి వచ్చే విదేశీయులను గుర్తించి వారికి కరోనా ఆనవాళ్ళున్నాయా లేదా తెలుసుకోవాలన్నారు. విదేశీ అతిథులను గుర్తించి వారి సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. విదేశాలకు వెళ్ళే ప్రయాణాలను తగ్గించుకోవాలన్నారు. అత్యవసరమైతేనే బయటకు వెళ్ళాలని సూచించారు. వాణిజ్య సముదాయాల్లోకి వచ్చేవారికి ముందుగా ద్వారాల వద్ద చేతులు శుభ్రం చేసుకునే ఏర్పాటుచేయాలన్నారు. హోటళ్ళు, లాడ్జీలకు కొత్త వ్యక్తులు వస్తే వారి సమాచారం తమకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, ఎంహెచ్‌ఓ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెంచలకోన దేవునికి బంగారు గరుడోత్సవం

రాపూరు మండలంలోని పెంచలకోనలో కొలువై వున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈనెల 13న స్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో బంగారు గరుడవాహనోత్సవం నిర్వహించారు. స్వామివారి అలంకార మండపంలో కనువిందుగా జరిగిన ఈ ఉత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి శోభాయమానంగా అలంకరించి మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చటనల మధ్య పెంచలకోన తిరువీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం వేకువన నాలుగు గంటలకు శ్రీవారి మూలమూర్తికి పాలు, తేనె, పసుపు, పెరుగు, చందనం, కొబ్బరినీళ్ళు, పంచదార, నెయ్యి ఇలా వివిధరకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. ఉదయం 8 గంటలకు స్వామివారి కళ్యాణమండపంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామిని, ఆదిలక్ష్మీదేవి- చెంచులక్ష్మీదేవి అమ్మవార్లను కొలువుదీర్చి పుష్పమాలికలతో అందంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, అర్చకులు సీతారామయ్యస్వామి, శశిస్వామి, త్రినాథ్‌స్వామి, నాగరాజస్వామి, గిరిస్వామి తదితరుల నేతృత్వంలో స్వామివార్లకు విశేషపూజలు జరిగాయి.

### ఇసుక అక్రమ రవాణాపై...

## నిఘా ఉంచాలి

నెల్లూరు జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పూర్తి స్థాయిలో ఆయా స్టేషన్ల పరిధిలో నిఘా పెంచాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. రీచ్ నుంచి రవాణా అవుతున్న ఇసుక ట్రాక్టర్లు, లారీలపై ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమ రవాణాను గుర్తిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. ఈనెల 17న నెల్లూరు అసిస్టెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఇసుక రవాణాపై నిత్యం తనిఖీలు చేయాలనే ఆదేశాలు రాష్ట్ర డైరెక్టర్ నుంచి అందాయని దీనిపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎక్సైజ్ స్టేషన్ సీఐలు, ఎస్సైలు, రాత్రి వేళల్లోను ఇసుక రవాణా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని స్టేషన్ల సీఐలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పాల్గొన్నారు.

### రాంజీనగర్‌లో...

## ప్రభుత్వస్థలం అన్యాక్రాంతం

**- సిపిఎం నేతల ఆందోళన**

నెల్లూరు నగరంలోని 16వ డివిజన్ రాంజీనగర్ 5వ వీధిలో ఉన్న ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతోందని, వెంటనే దీనికి అడ్డుకట్ట వేయాలని సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ నెల 17న సిపిఎం నాయకులు మూలం రమేష్, కాయల శ్రీనివాసులు తదితరులు ఆ ప్రాంతంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతుంటే మునిసిపల్ అధికారులు మౌనంగా ఉండడం సముచితం కాదన్నారు. ఈ స్థలాన్ని ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఆ మేరకు నగరపాలక కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, మహిళాసంఘం నాయకురాలు మస్తాన్‌బీ, కుమార్, శేషు తదితరులు పాల్గొన్నారు.

## కాటా ముద్రలపై అవగాహన

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలోని వ్యాపారులకు అధికారులు కాటా ముద్రలపై ఇటీవల అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక పాండురంగ అన్నదాన సమాజం ఆవరణలో లీగల్ మెట్రాలజీ సహాయ కంట్రోలర్, పొట్టి శ్రీరాములు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వాడుకలో ఉన్న కాటాలు, పనిచేయకుండా మూలన పడేసివున్న కాటాలకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ముద్రలు వేయించుకోవచ్చని సూచించారు. ఏబిసిడి కేటగిరీల్లో గతంలో ముద్రలు వేసేవారమని, వ్యాపారులు తమ ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శిబిరంలో ముద్రలు వేసుకోవాలని చెప్పారు. వ్యాపారులు చెల్లించిన మొత్తానికి రశీదులు, సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఈ సర్టిఫికెట్లను దుకాణాల్లో బహిరంగంగా ప్రదర్శించాలన్నారు. లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ సాయిశ్రీకర్, టెక్నికల్ అడ్వైజర్ రియాజ్, దాసా లక్ష్మీనారాయణ, మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### సోమిరెడ్డి సమక్షంలో..

## టిడిపిలోకి మనుబోలు వైసిపి నాయకులు

మనుబోలుకు చెందిన వైసిపి నాయకుడు చేర్లో పద్మనాభరెడ్డి, కోసూరు ప్రసాద్‌గౌడ్‌లు ఈనెల 14న టిడిపిలో చేరారు. టిడిపి మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అల్లీపురంలో ఉన్న మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసానికి వెళ్ళి అక్కడ సోమిరెడ్డి సమక్షంలో వారు టిడిపిలో చేరారు. సోమిరెడ్డి వారికిపురికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా రాక్షసపాలన సాగిస్తోందని, టిడిపి నాయకులు, కార్యకర్తలపై ఆ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. టిడిపి జిల్లా కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు దండు చంద్రశేఖర్‌రెడ్డి, సాని వెంకటరమణయ్య, అంకయ్యగౌడ్, పచ్చిపాల రామిరెడ్డి, తిక్కవరపు శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, సూరిశెట్టి నాగేశ్వరరావు, కిరణ్‌కుమార్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు కంటి పరీక్షలు

నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలోని బాలభవిత కేంద్రంలో ఈనెల 13న 9నెలల లోపు చిన్నారులకు కంటి రెటీనా పరీక్షలు నిర్వహించారు. మచిలీపట్నంలోని గౌతమి ఇన్‌స్టిట్యూట్ నుంచి వచ్చిన వైద్యబృందం ఈ పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో కంటి లోపాలు ఉన్న అయిదుగురిని వైద్యులు గుర్తించి వారికి లేజర్ చికిత్స చేయాలని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో బాలభవిత కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ హేమంత్, డాక్టర్ సురేష్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే సహించం

**- ఆర్ఐఓ శ్రీనివాసరావు**

కరోనా వైరస్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు ఈనెల 19 నుంచి 31వ తేది వరకు సెలవులు ప్రకటించినందున ప్రభుత్వ, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహించకూడదని, ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ శ్రీనివాసరావు హెచ్చరించారు. జేఇఇ మెయిన్స్, అడ్వాన్స్, నీట్, తదితర కోర్సుల పేరుతో ఎలాంటి తరగతులు నిర్వహించినా ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

### విఎస్‌యులో

## లిఫ్ట్ సౌకర్యం

వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి యూనివర్శిటీ (విఎస్‌యు)లోని పరిపాలన భవనంలో ఏర్పాటుచేసిన కొత్త లిఫ్ట్‌ను ఈనెల 17న విఎస్‌యు వీసీ సుదర్శనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విఎస్‌యు రెక్టార్ ఎం.చంద్రయ్య, రిజిస్ట్రార్ అందె ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### నిమ్మ సాగులో మెళకువలు పాటిస్తే

## అధిక దిగుబడులు

నిమ్మ సాగు పట్ల రైతులు మరింతగా అవగాహన పెంచుకుని శాస్త్రవేత్తలు సూచించిన మెళకువలను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వెంకటగిరి మండలంలోని నిమ్మ, చీనీ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కవిత పేర్కొన్నారు. ఈనెల 13న స్థానిక టివిఎస్ శ్రీనివాస సేవాసంస్థ ఆధ్వర్యంలో రైతుల కోసం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిమ్మ పంట సాగుపట్ల రైతులకు అవగాహన కలిగించారు. సాగులో ఉన్న నిమ్మపంటలకు ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్ళను నివారించుకుని అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. టివిఎస్ క్లస్టర్ ఇన్‌ఛార్జి నందగోపాల్, శాస్త్రవేత్తలు బాలాహుస్సేన్‌లతో పాటు అనేకమంది రైతులు పాల్గొన్నారు.

# వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్న చంద్రబాబు

## - ఎమ్మెల్యే ప్రసన్న ఆరోపణలు



స్థానిక ఎన్నికల్లో టిడిపి గల్లంతవుతుందనే భయంతోనే చంద్రబాబునాయుడు వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని, రాష్ట్రమంతటా వైఎస్సార్సీపి గాలి వీస్తుం డడంతో చంద్రబాబు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్ కుమ్మక్కై ఎన్నికలను వాయిదా వేశారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 18న నార్త్‌రాజుపాళెంలోని విసిఆర్ అతిథిగృహంలో ఎమ్మెల్యే ప్రసన్న విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎన్నికలను వాయిదా వేసి రమేశ్‌కుమార్ చంద్రబాబు రుణం తీర్చుకున్నారంటూ ఆయన ఈ సందర్భంగా ఆరోపించారు. కరోనా వ్యాధి రాష్ట్రంలో పెద్దగా లేకపోయినా దానినే కుంటిసాకుగా చూపి ఎన్నికలు వాయిదా వేయడం దారుణమన్నారు. గ్రామాల్లో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగితే వైఎస్సార్సీ పికి మరింత మంచిపేరు వస్తుందని, టిడిపి కనుమరుగవుతుందనే ఇలా చేశారని ఆయన ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, మాజీ జడ్పీటిసి సభ్యుడు నల్లావుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పెనాక నాగ శ్రీనివాసులురెడ్డి, జడ్పీటిసి అభ్యర్థి పసుపులేటి సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విఎస్‌యు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకున్న

# డా. ఎల్.వి.కె.



ఎల్.వి.కె.గా సుపరిచితుడు, హైదరాబాద్‌లోని డా. బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తుండిన డా. ఎల్.విజయకృష్ణారెడ్డి నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా ఈ నెల 18వ తేదీన పదవీ బాధ్యతలు స్వీకరించారు. యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ సుదర్శన రావు సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎల్.వి.కె. గతంలో పత్రికా రంగంలో కూడా పని చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డికి ఆయన చాలా ముఖ్యుడు. వైయస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో ఒక పాత్రికేయుడిగానే కాకుండా, అనేక విషయాలలో ఆయన ప్రభుత్వానికి సలహాదారుగా కూడా తన సూచనలు, సలహాలు అందించారు. వైయస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ఎల్‌వికె రాసిన 'జననేత' పుస్తకం తెలుగు సాహితీ లోకాన్ని విశేషంగా ఆకట్టుకుంది. విద్యా రంగంలో అపార అనుభవంతో విఎస్‌యు రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎల్.వి.కె.కి 'లాయర్' అభినందనలు.

# స్పీకర్ తీరు దారుణం

## - కర్నాటి ధ్వజం



రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి విమర్శించారు. ఈ నెల 19వ తేదీన నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కలుగజేసుకుని స్పీకర్ పదవికి తమ్మినేని సీతారాం చేత రాజీనామా చేయించాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా హుందాగా వ్యవహరించాల్సిన స్పీకర్‌ను, హద్దు మీరి మాట్లాడుతున్న మంత్రులను అదుపు చేయడంలో జగన్మోహన్‌రెడ్డి విఫలమయ్యారని, స్పీకర్ తీరు అవమానకరంగా ఉందని, చివరకు ఎన్నికల కమిషనర్ పైనే అనుచిత వ్యాఖ్యలు చేసే స్థాయికి దిగజారిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. స్పీకర్ పదవికి రాజీనామా చేయించని పక్షంలో ముఖ్యమంత్రే ఆయనచే ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారని అనుమానించాల్సి వస్తుందని ఆంజనేయరెడ్డి పేర్కొన్నాడు. ప్రజలు వైసీపికి సంపూర్ణంగా మద్దతు పలికి 151 సీట్లు అందిస్తే... వైసీపి అంతే వేగంగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించాడు.




# వైసిపిలోకి బుర్లా

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ డైరెక్టర్ బుర్లా వెంకటేశ్వర్లుగౌడ్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. నెల్లూరురూరల్ వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వైసిపిలో చేరడం జరిగింది. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ 2008లో 20వ డివిజన్‌కు జరిగిన ఉపఎన్నికలలో కార్పొరేటర్‌గా విజయం సాధించి రాజకీయ ఆరంగేట్రం చేసింది ఈ బుర్లా వెంకటేశ్వర్లుగౌడ్ మీదే! వెంకటేశ్వర్లుగౌడ్‌తో పాటు సిహెచ్ హరిబాబుయాదవ్, పద్మజా యాదవ్ మరికొందరు నాయకులు కూడా వైసిపిలో చేరడం జరిగింది.

# నెల్లూరులో ఎన్సీఇఆర్‌టి ఏర్పాటు ఉందా?

## - లోక్‌సభలో ప్రశ్నించిన ఆదాల



నెల్లూరులో జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎన్‌సిఇఆర్‌టి) ప్రాంతీయ విద్యా సంస్థను ఎప్పుడు ఏర్పాటు చేస్తారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించాడు. ఈ వారంలో ఆయన లోక్‌సభలో పలు అంశాలపై కేంద్రాన్ని నిలదీశాడు. ఎన్‌సిఇఆర్‌టి గురించి ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ ఏర్పాటులో ఏమన్నా ఇబ్బందులున్నాయా అని కూడా ఆయన అడిగాడు. దీనికి కేంద్రమానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ సమాధాన మిస్తూ నెల్లూరులో ఎన్‌సిఇఆర్‌టి ప్రాంతీయ విద్యాసంస్థ ఏర్పాటుకు సంబంధిత వర్గాల ఆమోదం అవసరమని, దీనిపై నివేదిక కోరి వున్నామని, ఆ నివేదిక రాగానే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరులో ఏర్పాటు చేయబోయే సంస్థ ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరిలకు కేంద్రబిందువుగా వుంటుందని కేంద్రమంత్రి తెలిపాడు.

అలాగే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుపై ఆదాల అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ శాఖ మంత్రి ప్రతాప్ చంద్రసారంగి సమాధానమిస్తూ ఈ హార్బర్ ఏర్పాటుకు 288.80కోట్లు అవసరమవుతాయని, కేంద్రప్రభుత్వం ఇందులో సగం వాటాను అందజేయాల్సి వుంటుందని, తగు నివేదికలు రాగానే దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఫిషింగ్ హార్బర్ పూర్తికి నాలుగేళ్ళు పడు తుందన్నారు.

లోక్‌సభలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇంకా కరోనా వైరస్ విస్తరించకుండా కేంద్రం ఏం చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించాడు. గ్రామీణ ప్రాంతాలలో పోస్టల్ బ్యాంకింగ్ సేవల గురించి అడిగి వివరాలు రాబట్టాడు.

# పది విద్యార్థులకు కరోనా పరీక్ష



- ఓ పక్క నూతన ప్రశ్నా పత్ర విధానం... ఇంకోపక్క కరోనా ప్రభావం
- గడ్డు పరిస్థితుల మధ్య పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

ఓ పక్క కరోనా వైరస్ ప్రభావంతో దేశమంతా హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటిస్తోంది. ఇళ్ళల్లోంచి జనం బయటకు రాలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నెల 31వ తేదీ దాకా దేశ వ్యాప్తంగా విద్యాసంస్థలన్నింటికీ సెలవులిచ్చేశారు. ఎలాగో ఇంటర్ పరీక్షలు అయిపోయాయి. అన్నింటికంటే ముఖ్యమైనది పదో తరగతి పరీక్షలు. మిగతా అన్ని రకాల ఎంట్రన్స్ టెస్ట్‌కు ఇంకా సమయం ఉంది కాబట్టి ఇబ్బంది లేదు. కానీ పదోతరగతి పరీక్షలు ఈ నెల 31వ తేదీ నుండే ప్రారంభం కావాల్సి వుంది. ఆరోజు దాకా కూడా విద్యాసంస్థలకు సెలవులే! ఓ పక్క ఈ విద్యాసంవత్సరం నుండే మారిన పరీక్షా పత్ర విధానం విద్యార్థులకు ఓ సమస్య అయితే, ఇంకో పక్క కరోనా వైరస్ భయం విద్యార్థులకు గడ్డు పరీక్షగా మారుతోంది.

ప్రతి విద్యార్థి జీవితంలో పెద్దమలుపు పదో తరగతి పాస్ కావడం. ఈ తరగతిలో మంచి మార్కులతో గట్టెక్కాడంటే ఇక ఇష్టమైన కెరీర్ దిశగా దూసుకుపోవడమే. ఒకప్పుడు టెన్త్‌లో ఫస్ట్‌క్లాస్‌లో పాస్ కావడమంటే సివిల్ సర్వీస్‌లో ర్యాంకు సాధించి నంత గొప్పగా వుండేది. ఇప్పుడు ఫస్ట్ క్లాస్ అంటే లెక్కేలేదు. పదికి పది గ్రేడ్ వస్తేనే సంతృప్తి. 9 గ్రేడ్ వచ్చినా అసంతృప్తే!

ఇప్పటివరకు గ్రేడ్‌లు, ర్యాంకుల సంస్కృతితో సాగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈసారి అసాధారణ మార్పులు చేశారు. మాస్ కాపీయింగ్‌ను నిరోధించే దిశగా బిట్‌పేపర్‌ను సైతం ప్రశ్నా పత్రంలోనే పొందుపరిచారు. గతంలో బిట్ పేపర్లు విడిగా ఇస్తున్నందువల్ల, వాటిని కొందరు ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్‌లో ఫోటో తీసి కార్పొరేట్ విద్యాసంస్థలకు పంపిస్తుండే వాళ్ళు. ఇలాంటి లీకులు ఎన్నో బయటపడ్డాయి. అదీగాక మొన్నటి వరకు వున్న విధానంలో కేవలం కొన్ని ప్రశ్నలకు జవాబులు బట్టీ పట్టడం జరిగేది. ఇప్పుడు టెస్ట్ బుక్ మొత్తం చదివేలా... ఆ టెస్ట్‌బుక్‌లో విషయమంతటిపై విద్యార్థులకు అవగాహన కలిగేలా ప్రశ్నా పత్రాలు రూపుదిద్దారు.

కాకపోతే మారిన విధానంలో ప్రశ్నాపత్రాలు ఎలా వుండ బోతున్నాయోననే ఆందోళన ఈ సంవత్సరం పరీక్షలకు హాజరు కాబోతున్న విద్యార్థులను వెంటాడుతోంది. కాబట్టి ప్రశ్నాపత్రాలు ఏ విధంగా వుండబోతున్నాయనేదానిపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాక ప్రశ్నాపత్రాలపై వారికున్న భయాందోళనలను కూడా తొలగించాలి. వేలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్‌కు బాటలు వేసుకునేలా ఎన్నో ఆశలతో పదోతరగతి పరీక్షలకు సమాయత్తమవుతున్న తరుణంలో జిల్లా అధికార యంత్రాంగం కూడా వారికి సహకరించాలి. ముఖ్యంగా ఈ పరీక్షల సీజన్‌లో వివిధ మతాల ప్రార్థనా మందిరాల వద్ద పెద్దపెద్ద లౌడ్‌స్పీకర్లలో ప్రార్థనలు చేస్తుంటారు. తెల్లారుజామున, రాత్రివేళల్లో లౌడ్‌స్పీకర్లు, ప్రార్థనలు, పాటలు, భజనలు వినిపిస్తున్నందువల్ల పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందిపడే అవకాశముంది. కాబట్టి ప్రార్థనా మందిరాల వద్ద లౌడ్‌స్పీకర్‌ల వాడకాన్ని పరీక్షలు పూర్తయ్యే వరకు నిషేధించాల్సి వుంది.

# అపాచీలో అప్రమత్తం

నెల్లూరు జిల్లా తడ మండలం మాంబట్టు సెజ్‌లోని అపాచీ పరిశ్రమ కార్మికుల భద్రత కోసం ప్రతి కార్మికుడికి యాజమాన్యం ఈనెల 16న మాస్కులు అందజేసింది. వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వచ్చే కార్మికులు ఒకే ప్రదేశంలో విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో కరోనా వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కరపత్రాలు అంటించి వీడియో ద్వారా అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు తరచూ చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మరుగుదొడ్ల వద్ద చేతులు శుభ్రపరచుకునే ద్రావణాలను ఏర్పాటు చేశారు. విధుల కొచ్చే కార్మికులకు ముందుగానే శరీర ఉష్ణోగ్రతను పరీక్షించేలా వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు పీఆర్వో రాజారెడ్డి తెలిపారు.

# కాంగ్రెస్‌లోకి జలీల్‌ఖాన్




నెల్లూరు నగరానికి చెందిన స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు పఠాన్ జలీల్‌ఖాన్ సుమారు 50మంది తన అనుచరులతో ఈ నెల 19వ తేదీన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. చేవూరు దేవకుమార్‌రెడ్డి వారందరికీ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికాడు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ దేశంలో అన్ని కులాల వారినీ, అన్ని మతాల వారినీ సమానంగా ఆదరించిన పార్టీ కాంగ్రెస్సేనన్నాడు. సెక్యులర్ సిద్ధాంతాలకు కట్టుబడి దేశ సమైక్యతకు కృషి చేసింది కాంగ్రెస్‌పార్టీయేనని, కేంద్రంలోని బీజేపీ ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు ఎన్నో కుట్రలు చేస్తోందని ఆరోపించాడు. దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వాలలోనే అమలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావ్, షేక్ ఫయాజ్, అల్లాఉద్దీన్, సర్ఫ్‌రాజ్, షబ్బీర్, షేక్ హుస్సేన్ బాషా, ఎస్.కె.కరీముల్లా, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రభా'తం

## ఇది కూడా ప్రపంచ యుద్ధమే

అమెరికాను చూసి రష్యా భయపడుతుంది, రష్యాను చూసి ఇరాన్ భయపడుతుంది, ఉత్తర కొరియాను చూసి అమెరికా భయపడుతుంది, ఇజ్రాయిల్‌ను చూసి పాలస్తీనా భయపడుతుంది... ఇప్పుడు ఇవన్నీ గాలికి కొట్టుకుపోతున్నాయి. మిలియన్ టన్నుల కొద్ది పోగేసిన అణ్వాయుధాలు దండగగా కనిపిస్తున్నాయి. సామ్రాజ్యవాద కాంక్ష నిష్ప్రయోజనంగా మారుతోంది. ఎంత ఆధిపత్యం ఉండి ఏమి లాభం, ఎంత అగ్రరాజ్యంగా ఉండి ఏం ప్రయోజనం... ఎంత సంపాదన ఉండి కూడా ఏమున్నది గర్వకారణం... ఒక కంటికి కనిపించని సూక్ష్మజీవి ముందు ప్రపంచం మొత్తం పలాయనం చిత్తగిస్తోంది. ప్రపంచంలోనే అగ్రరాజ్యమని ఎగిరెగిరి పడుతున్న దేశానికి, ఆ అగ్రరాజ్యానికి మేమే పోటీ అని మదమెక్కి కొట్టుకుంటున్న మరో పెద్ద దేశానికి ఒక పెద్ద గుణపాఠం నేర్పిన ఆ జీవి పేరే కరోనా వైరస్. ఈరోజు ప్రపంచంలోని ఆయా దేశాలు తమలో తాము కొట్టుకోవడం మానేసి ఈ వైరస్‌ను ఎదుర్కోవడంపై దృష్టి పెట్టాయి. ఈరోజు ప్రపంచ దేశాలు అన్నీ ఒకే సమస్యను ఎదుర్కొంటున్నాయి. అందరికీ సమస్య కరోనా. ఈ వైరస్‌తో ప్రపంచ దేశాలన్నీ అతలాకుతలం అవుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తలకిందులైంది. గత కొన్ని దశాబ్దాలలో ఎప్పుడూ లేనటువంటి పరిస్థితులు ఈరోజు ప్రపంచంలో నెలకొన్నాయి. విమానాలు ఎగరడం లేదు, సముద్రంలో బోటులు నడవడం లేదు, ప్రపంచ మార్కెట్ స్తంభించి పోయింది, షేర్ల విలువలు పడిపోయాయి, వ్యాపార వాణిజ్యాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఎగుమతులు, దిగుమతులు దాదాపు ఆగిపోయాయి. 163 దేశాలలో ఒకటే మాట... ఒకటే ప్రయత్నం... కరోనా వైరస్‌ను అరికట్టడమే లక్ష్యం.

ఈ వైరస్ ఒకరకంగా ప్రపంచానికి మేలు చేస్తుందేమో అని అనిపిస్తుంది. ఎందుకంటే ఈరోజు దేశాలన్నీ కూడా విద్వేషాలు మరిచి ఆధిపత్య పోరు బాట విడిచి, ఈ వైరస్‌ను ఎదుర్కోవడం పైన దృష్టి పెట్టాయి. ఈ వైరస్ ప్రపంచానికి ఇస్తున్న సంకేతం ఏమిటంటే మీ దగ్గర ఉన్న అణ్వాయుదాల కంటే నేను ఎంతో శక్తిమంతురాలిని అని, మీ దగ్గర ఉన్న అన్ని ఆయుధాలు ప్రయోగించినా నన్ను నాశనం చేయలేరని... కాబట్టి ఈరోజు ప్రపంచ దేశాలు తెలుసుకోవాల్సింది ఆయుధాలు పేరుకుపోవడం వల్ల తమకు ఎటువంటి రక్షణ లేదని, కేవలం ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం, వైద్య విధానాలను అభివృద్ధి పరచుకోవడం, ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవనాన్ని అందించడంపైనే ఆయా దేశాలు ప్రధానంగా దృష్టిసారించాలి.



> కరోనా వైరస్ ఒకరకంగా ప్రపంచానికి మేలు చేస్తుందేమో అనిపిస్తుంది. ఎందుకంటే ఈరోజు దేశాలన్నీ కూడా విద్వేషాలు మరిచి ఆధిపత్య పోరుబాట విడిచి, ఈ వైరస్‌ను ఎదుర్కోవడం పైన దృష్టి పెట్టాయి. ఈ వైరస్ ప్రపంచానికి ఇస్తున్న సంకేతం ఏమిటంటే మీ దగ్గర ఉన్న అణ్వాయుదాల కంటే నేను ఎంతో శక్తిమంతురాలిని అని, మీ దగ్గర ఉన్న అన్ని ఆయుధాలు ప్రయోగించినా నన్ను నాశనం చేయలేరని. కాబట్టి ఈరోజు ప్రపంచ దేశాలు తెలుసుకోవాల్సింది ఆయుధాలు పేరుకుపోవడం వల్ల తమకు ఎటువంటి రక్షణ లేదని, కేవలం ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం, వైద్య విధానాలను అభివృద్ధి పరచుకోవడం, ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవనాన్ని అందించడం పైనే ఆయా దేశాలు ప్రధానంగా దృష్టిసారించాలి.

ఈరోజు ప్రపంచం సామూహికంగా ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి ఉగ్రవాదం అయితే, రెండోది కరోనా వైరస్. మొదటిది మతపరమైన ఉన్మాదంతో జరుగుతున్న చర్య, ఇది స్వయం మానవ తప్పిదం. కొన్ని లక్షలమంది ఈ చర్యలకు బలయ్యారు. దాదాపు 50కిపైగా దేశాలు ఉగ్రవాదం బారినపడి ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాద నిర్మూలన కోసం భారత ప్రధాని నరేంద్ర మోడీ గత ఆరేళ్లుగా కొనసాగిస్తున్న పోరాటం చూస్తున్నాం. పాకిస్తాన్ లాంటి ఉగ్రవాద ప్రేరేపిత దేశాలు తప్పితే ప్రపంచ దేశాలన్నీ కూడా మోడీ పోరాటానికి వెన్ను దన్నుగా నిలుస్తున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాదం మూలంగా ఈ ప్రపంచంలో కొన్ని లక్షలమంది మరణాలతోపాటు కొన్ని లక్షల కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. ఈవేళ ఇదే ఉన్మాదం కొనసాగితే ప్రపంచం భవిష్యత్తులో ఇంకెంత నష్టపోతుందో చెప్పలేము. కాబట్టి ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడం ఇప్పుడు ప్రపంచ దేశాల అన్నిటిపై ఉన్న ప్రధాన బాధ్యత.

ఇక రెండోది కాలానుగుణంగా వాతావరణ మార్పులను బట్టి ప్రబలుతున్న వైరస్‌లు. మనిషి ఆహారపు అలవాట్లు, ప్రకృతిని చెర పట్టడం, పర్యావరణాన్ని కలుషితం చేయడం వంటి చర్యల ద్వారా మానవ సమాజం తన వినాశనాన్ని తానే కొన్ని తెచ్చుకుంటోంది. గత చరిత్రను పరిశీలిస్తే ఈ భూమ్మీద ఎన్నో రకాల వైరస్‌లు పుట్టుకొచ్చాయి, మృత్యు ఘంటికలు మోగించాయి. కాలక్రమంలో వైరస్‌లు రావడం... వాటికి వ్యాక్సిన్లు కనుగొనడం జరుగుతూ వచ్చింది. అయితే వాతావరణ మార్పుల వల్ల వైరస్‌ల పుట్టుక ఆగలేదు. ఇలా ఎంతకాలం?

ఇప్పుడు ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్‌గా మారింది. ఒక దేశంలో వైరస్ వచ్చినా ప్రపంచం మొత్తం చుట్టిరావడానికి పెద్దగా సమయం పట్టడం లేదు. రెండు నెలల క్రితమే చైనాలోని ఉహాన్ నగరంలో పుట్టిన వైరస్ ఇంత తక్కువ సమయంలో 163 దేశాలకు పాకిందంటే దాని ప్రభావం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈరోజు ప్రపంచ జనజీవనమే స్తంభించిపోయింది. కొన్ని దేశాలలో హెల్త్ ఎమర్జెన్సీ కొనసాగుతోంది. ప్రజలు ఇళ్ళల్లోంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఆహారం, నిత్యావసర వస్తువులకు కొరత ఏర్పడుతోంది. కొద్దిరోజులు ఇలాగే కొనసాగితే అగ్రరాజ్యాలే ఆహారం కోసం అలమటించే పరిస్థితులు నెలకొనవచ్చు.

వైరస్ అనేది ఏ ఒక్క దేశానికో సంబంధించిన సమస్యో అని సరిపెట్టుకోనవసరం లేదు. వైరస్‌ను అరికట్టడం ప్రతి దేశం తన బాధ్యతగా భావించాలి, వైరస్‌ల నిరోధానికి, వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి అన్ని దేశాలు సంయుక్తంగా కృషి చేయాలి. ఆయా దేశాల మధ్య మూడో ప్రపంచ యుద్ధం జరిగే అవకాశం ఉందని ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు ప్రపంచ యుద్ధం చేయాల్సింది ఇలాంటి వైరస్‌ల మీద. లేదంటే ప్రపంచం అడుక్కుతినే స్థాయికి పడిపోతుంది.

---

పూర్వ విద్యార్థుల

## అపూర్వ సమ్మేళనం



ఓజిలి మండలం చిల్లమానేను గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008-09 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఇటీవల తాము చదువుకున్న ఆ పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందించారు. నాటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా గురువులు పూర్వ విద్యార్థులకు తమ ఆశీస్సులందజేశారు. 2008-09లో ఇక్కడ చదువుకున్న ఆ విద్యార్థులందరూ టెన్త్‌లో నాటికి నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 67మంది విద్యార్థుల్లో 97శాతం మంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కొందరు ఇంకా ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. వీరి అభిమానం, ఆత్మీయతలతో పాఠశాల ప్రాంగణం పులకించింది.

## పోషకాహారంపై తల్లులకు అవగాహన

నెల్లూరు నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 14న పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని వెంగళరావునగర్, జాకీర్‌హుస్సేన్ నగర్ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న తల్లులకు పోషకాహారంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్లు ఏ.లక్ష్మీబాయి, సునీలత మాట్లాడుతూ పోషకాహారంలో భాగంగా తల్లులు తాజా ఆకుకూరలు, కూరగాయలు రోజువారీ ఆహారంలో తప్పకుండా తీసుకోవాలని, అంతేకాక తాజా పండ్లు, చిరుధాన్యాలను కూడా ఆహారంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు.

---




## వాయిదా వేయాల్సిన అవసరం ఏంటి

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసేటంతటి భయంకరమైన పరిస్థితులు ఏమీ లేవు. కరోనా వైరస్ కేసులు రాష్ట్రంలో తక్కువగానే ఉన్నాయి. వైరస్ ప్రభావం ఉన్న నెల్లూరు నగరంలో మున్సిపల్ ఎన్నికలను ఇప్పటికే వాయిదా వేసుకున్నారు. గ్రామాలలో వైరస్ ప్రభావం తక్కువగానే ఉంటుంది. విదేశాల నుంచి వచ్చిన వారి వల్లే ఈ వైరస్ వ్యాప్తి చెందుతుంది. ఇలాంటి వాళ్లు నగరాల్లోనే ఎక్కువగా ఉన్నారు. అదీగాక ఎన్నికలను ఈ నెలాఖరులోపు జరపకపోతే కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఆగిపోయే ప్రమాదం ఉంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు లేకుండానే ఎన్నికలను వాయిదా వేయడం అసంబద్ధ నిర్ణయం.

**- కొండారెడ్డి, పి.కె.పాడు.**

## సంస్కారం నేర్పిన కరోనా

కరోనా వైరస్ ప్రపంచాన్ని ఎంతగానో వణికిస్తున్న సంగతి చూస్తున్నాం.. ఇదే కరోనా ప్రపంచానికి ఎన్నో గుణపాఠాలు కూడా నేర్పింది. ముఖ్యంగా భారతీయ సంస్కృతి సాంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తుంది. భారతీయ సంస్కృతిలో భాగమైన నమస్కారం గొప్పతనమేంటో ఇప్పుడు అన్ని దేశాలు గ్రహిస్తున్నాయి. ప్రపంచ దేశాలన్నీ కూడా నమస్కారం బాట పట్టాయి. గౌరవ సూచకంగా భారతీయ నమస్తే విధానాన్ని పాటిస్తున్నాయి. ఎదుటి వారి చేతులు తాకడం వల్ల వైరస్ అంటుకుంటుందని మన పూర్వీకులు ఎప్పుడో పసిగట్టారు, అందుకే చేతులెత్తి నమస్కరించే పద్ధతి కనిపెట్టారు. మనకు నిన్నటివరకు నాటు పద్ధతి అనిపించిన నమస్తే విధానమే ఈరోజు ఆరోగ్య విధానంగా మారిపోవడం గమనించాల్సిన విషయం.

**- బి.కేశవరావు, నెల్లూరు.**

## డిజిపిపై విమర్శలు సరికాదు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిజిపి గౌతమ్ సవాంగ్‌పై మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుచిత వ్యాఖ్యలు సముచితం కాదు. చంద్రబాబునాయుడు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తూ అందుకు డిజిపిని బాధ్యునిగా చేస్తూ, డిజిపిపై విమర్శలు చేయడం సమర్ధ అధికారుల పనితీరును దెబ్బతీసే విధంగా ఉంది. విశాఖపట్నంలో ప్రజల ఆగ్రహాన్ని చవిచూసిన చంద్రబాబు తన సహనాన్ని కోల్పోయి, ప్రజలు తనపై ఆగ్రహం వ్యక్తం చేయడానికి డిజిపియే కారణమని వ్యాఖ్యానించడం విడ్డూరం.

**డా॥ ఎస్.బాబూరావు, కావలి.**

## నెల్లూరు..గాంధీ!

పూజ్య బాపూజీ శిష్యుడు, నెల్లూరు గాంధీగా శ్రీ పొట్టి శ్రీరాములు గారిని చెప్పుకోవచ్చు. విద్యావంతుడు, ఆశయ సాధనలో గట్టివాడు. తన ప్రాణాలను పణంగా పెట్టిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ సాధకుడు. ఆలయాలలో అందరికీ ప్రవేశం కల్పించారు. జిల్లా చేసుకున్న అదృష్టం శ్రీ రాములు గారు. ఆయన దేశానికే గర్వకారణం. ఆయన జయంతి మార్చి 16 సందర్భంగా ఆయనను గుర్తుచేసుకుంటూ...!జై అమరజీవి!

**ఐనకోట రవికుమార్, నెల్లూరు.**

## ఆ మాటలు హాస్యాస్పదం

సిఏఏ, ఎన్‌పిఆర్, ఎన్‌ఆర్‌సి చట్టాలను అమలు చేస్తే భారత్ మరో సిరియా అవుతుందంటూ పార్లమెంటులో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడడం హాస్యాస్పదం. భారత్‌ను సిరియాలాగా మార్చాలంటే ఓవైసీ ముత్తాతల తరం కూడా కాదు. భారత్ కోసం ప్రాణాలు అర్పించే లక్షలాది మంది కరసేవకులు సిద్ధంగా ఉన్నారు. యుద్ధానికి అయినా మేము సిద్ధమే.

**సి. రాజీవ్, నెల్లూరు.**

## నేతలకు నిరుత్సాహం...
# కార్యకర్తలకు ప్రోత్సాహం

- ఎమ్మెల్యేలకు మింగుడుపడని జగన్ నిర్ణయాలు
- అభ్యర్థుల ఎంపికలో కొత్త ఒరవడిపై కార్యకర్తల్లో ఆనందం



స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఒక సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఇంతకు ముందు స్థానిక సంస్థల ఎన్నికలు అంటే నియోజకవర్గాల ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రభావం అధికంగా ఉండేది. జడ్పీ చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ల ఎంపికలో వారు కీలకపాత్ర ధారులుగా వుండేవారు. వారు ఎవరినైతే నిర్ణయిస్తారో వారే అభ్యర్థులుగా ఉండేవారు. ఈ క్రమంలో ఎక్కువగా వారి బంధువులు లేదా ముఖ్య అనుచరులు పదవులు పొంది ఉండేవాళ్ళు. దీంతో పార్టీ కోసం సుదీర్ఘ కాలం పని చేసినవాళ్ళు వెనకబడి పోయేవాళ్ళు. అప్పటికప్పుడు అవతల పార్టీల నుంచి ఇక్కడికి వచ్చి పదవులు ఎగరేసుకుని పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇంకొన్ని చోట్ల అయితే పదవులకు బేరాలు కూడా జరిగేవి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో గానీ, నిన్నటి తెలుగుదేశం ప్రభుత్వంలో గానీ ఇలాంటి సంఘటనలు లెక్కలేనన్ని జరిగాయి.

అయితే ఇప్పుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. జడ్పీ చైర్‌పర్సన్లు, మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ల ఎంపికలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల పాత్రను నామమాత్రం చేశారు. పార్టీకి ఎవరు త్యాగాలు చేశారు, ఎవరు పార్టీ కోసం కష్టపడ్డారు అనే అంశాలను క్షేత్రస్థాయిలో గుర్తిస్తూ అధిష్టానమే ఈ పదవులకు అభ్యర్థులను నిర్ణయించే పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆనం అరుణ ఎన్నిక జరిగిందని తెలుస్తోంది.

2017లో జరిగిన స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికలలో ఆనం విజయకుమార్ రెడ్డి పార్టీ కోసం ఎంతో సాహసం చేశారు. స్థానిక సంస్థల శాసనమండలి నుండి పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితుల్లో ఆయన రంగంలోకి దిగాడు. అదీగాక వైసిపి ప్రతిపక్షంలోకి వచ్చిన కొత్తల్లోనే అందరూ అధికార తెలుగుదేశం పార్టీ వైపు పరుగులు తీస్తుంటే, ఆనం విజయకుమార్‌రెడ్డి మాత్రం వైసీపీలో చేరాడు. ఆయన చిత్తశుద్ధిని వైయస్ జగన్మోహన్‌రెడ్డి గుర్తించాడు కాబట్టే ఆయన కుటుంబానికి జడ్పీ ఛైర్‌పర్సన్ పదవి దక్కడానికి మార్గం సుగమం అయ్యింది. ఇదే పాలసీని మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎంపికలోను పాటించనున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం పార్టీ కార్యకర్తల్లో ఎనలేని ఉత్సాహాన్ని నింపుతోంది. ఇప్పటివరకు ఈ పదవులు గాని, నామినేటెడ్ పదవులు గాని ఎమ్మెల్యేల బంధువులకు లేదా వారు సూచించిన వారికి మాత్రమే వస్తాయని భావిస్తూ వచ్చారు, అయితే ఇప్పుడు జగన్ తీసుకున్న నిర్ణయంతో సాధారణ వైసీపీ కార్యకర్తల్లో సైతం తాము కష్టపడి పనిచేస్తే ఖచ్చితంగా గుర్తింపు పొందుతామనే నమ్మకం ఏర్పడింది. ఇక ఈ పరిణామాలు ఎమ్మెల్యేలు, ఇతర నేతలకు మాత్రం తీవ్ర నిరుత్సాహాన్ని కలిగిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో కొంతమంది ఎమ్మెల్యేలు తమ బంధువులు కుటుంబసభ్యులను జడ్పీ ఛైర్‌పర్సన్ బరిలోకి దించాలను కున్నారు. ఇందుకోసం తమకు అనువైన జడ్పీటీసీలను కూడా ఎంపిక చేసుకున్నారు. అయితే జగన్ తీసుకున్న నిర్ణయంతో వారి ఆశలకు తెరదించినట్లయింది.

# విశ్వాసానికి బహుమానం

## సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ వైసీపీ అభ్యర్థిగా దబ్బల శ్రీమంత్‌రెడ్డి



*దివంగత నేత స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని నమ్ముకున్న వాళ్ళు ఎవరూ నష్టపోలేదు. మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును నమ్ముకున్న వాళ్ళు ఎవరూ బాగుపడలేదు. ఇది చరిత్ర చెప్పిన సత్యం. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన తండ్రి పంథాలోనే కొనసాగుతున్నాడనిపిస్తోంది.*

ఎవరు తనకోసం, తన పార్టీ కోసం పని చేశారు, తమ కోసం ఏవిధంగా నష్టపోయారు అనేది గుర్తిస్తున్నాడు. అలా గుర్తించిన వారికి తగు న్యాయం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే గుర్తించిన నాయకుడు దబ్బల శ్రీమంత్‌రెడ్డి.. ప్రస్తుత సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ వైసీపీ అభ్యర్థి. శ్రీమంత్‌రెడ్డి తండ్రి స్వర్గీయ దబ్బల రాజారెడ్డి సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తొలి నాయకుడు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన ఈ నియోజకవర్గంలో వైసిపి తొలి అభ్యర్థి కిలివేటి సంజీవయ్య గెలుపు కోసం ఆ రోజుల్లో ఆయన ఎంతో కష్టపడ్డారు. పెద్దపెద్ద నాయకులు అంతా కూడా తెలుగుదేశంలో ఉన్న తరుణంలో వైసీపీకి రాజారెడ్డి పెద్ద దిక్కుగా నిలిచాడు. పార్టీ కోసం ఆర్థికంగా, ఆరోగ్యంగా ఎంతో కోల్పోయాడు. పార్టీ అధికారంలోకి రావాలన్న ఆశ నెరవేరకుండానే, వైయస్ జగన్‌ను సీఎంగా చూడాలన్న కోరిక తీరకుండానే ఆయన అనారోగ్యంతో కన్నుమూశారు. అయితే జగన్ ఆ విశ్వాసాన్ని మరిచిపోలేదు. రాజారెడ్డి పట్ల తనకున్న అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకుంటూ ఈ మున్సిపల్ ఎన్నికలలో ఆయన కొడుకు

(మిగతా 9వ పేజీలో)

# ఏకగ్రీవాలన్నీ ఏకపక్షమే






- ఫ్యాన్‌స్పీడ్‌కు సైకిల్ తునాతునకల్

***జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదటి అంకంలోనే వైసిపి జైత్రయాత్ర మొదలైంది. జిల్లా చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో జడ్పీటీసీలు, ఎంపీటీసీలు అధికార వైసిపి ఖాతాలో జమపడ్డాయి. జిల్లాలో మొత్తం 46 జడ్పీటిసిలకు గాను 12 జడ్పీటీసీలు ఏకగ్రీవంగా చేజిక్కించుకుంది.***

నెల్లూరురూరల్ నుండి ఆనం అరుణమ్మ, తడ నుండి ఇందుమతి, డివి సత్రం నుండి టి.రమేష్, ఓజిలి నుండి జి.రవీంద్రరాజు, సూళ్లూరు పేట నుండి యు.సుప్రియ, రాపూరు నుండి సిహెచ్ ప్రసన్న, నాయుడుపేట నుండి కట్టా జ్యోతి, పెళ్లకూరు నుండి ప్రిస్కిల్లా, సీతారాంపురం నుండి సిహెచ్ రమణారెడ్డి, బుచ్చిరెడ్డి పాలెం నుండి సూరా ప్రదీప, జలదంకి నుండి ఎం.శివలీల, అల్లూరు నుండి సిహెచ్ వీనమ్మ, రాపూరు నుండి సిహెచ్ ప్రసన్న ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలో 12 జడ్పీటీసీలు ఏకగ్రీవం కాగా ఇక 34జడ్పీటీసీలకు ఎన్నికలు జరుగనున్నాయి. అలాగే 554 ఎంపిటిసిలకుగాను 188 ఎంపీటీసీలు ఏకగ్రీవం కావడం విశేషం.

నియోజకవర్గాల వారీగా చూస్తే ఏకగ్రీవాలలో సూళ్లూరుపేట మొదటి స్థానంలో ఉంది. నియోజకవర్గంలోని 6జడ్పీటీసీలు ఏకగ్రీవం కావడంతోపాటు 61 ఎంపీటీసిలకు గాను 47ఎంపీటీసీలు ఏకగ్రీవమయ్యాయి. నియోజకవర్గంలో ఇక 13 ఎంపీటీసీ స్థానాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. రెండు ఎంపీటీసీలు తెలుగుదేశం ఖాతాలోకి వెళ్ళాయి. వెంకటగిరి నియోజకవర్గంలో రాపూరు జడ్పీటీసీ ఏకగ్రీవం అయింది. 67 ఎంపిటిసి స్థానాలకు గాను 29 ఎంపీటీసీలు ఏకగ్రీవం అయ్యాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో 67 ఎంపిటిసిలకు గాను 27 ఎంపీటీసీలు ఏకగ్రీవం అయ్యాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో 77 ఎంపిటిసిలకు 23 ఏకగ్రీవం అయ్యాయి. గూడూరు నియోజకవర్గంలో 60 ఎంపిటిసిలకు 14 ఎంపీటీసీలు ఏకగ్రీవమయ్యాయి. కోవూరు నియోజకవర్గంలో 76 ఎంపిటిసిలకు 12 ఏకగ్రీవమయ్యాయి. కావలి నియోజక వర్గంలో 47 ఎంపిటిసిలకు ఆరు ఏకగ్రీవమయ్యాయి. నెల్లూరురూరల్‌లో 12 ఎంపిటిసిలకు నాలుగు ఏకగ్రీవమయ్యాయి. ఉదయగిరి నియోజకవర్గంలో 83 ఎంపిటిసిలకు 26 ఏకగ్రీవం అయ్యాయి.

నెల్లూరురూరల్‌లో ఉన్న ఒక జడ్పిటిసి వైసీపీ ఖాతాలోకి పోయింది. నియోజక వర్గంలో సీతారాంపురం, జలదంకి వైసీపీ ఖాతాలో చేరాయి. కావలి నియోజక వర్గంలో అల్లూరు ఏకగ్రీవం అయింది. కోవూరు నియోజకవర్గంలో బుచ్చిరెడ్డిపాలెం జడ్పిటిసి ఏకగ్రీవం అయింది. వెంకటగిరి నియోజకవర్గంలో రాపూరు వైసిపి ఖాతాలో చేరింది. ఇంకా ఎంపీపీల వారీగా చూసినా మెజార్టీ ఎంపీటీసీలు ఆయా మండలాల్లో ఏకగ్రీవంగా వైసిపి అభ్యర్థులు అయ్యారు. కాబట్టి ఆ మండలాలు వైసిపి ఖాతాలో చేరినట్లే.. కాకపోతే ఆయా మండలాల్లో ఇంకా కొన్ని ఎంపిటీసిలకు ఎన్నికలు ఉన్నాయి కాబట్టి, వాటిని అప్పుడే లెక్కవేసి చెప్పలేరు.

జిల్లా మొత్తం మీద చూస్తే జడ్పీటీసీలలో, ఎంపిటిసిలలో 35శాతం స్థానాలు వైసిపి వశం అయినట్లే. పూర్తి స్థాయిలో ఎన్నికలు జరిగితే 95 శాతానికిపైగా సీట్లు వైసీపీకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## పోరుబాటలో...
# చేతులెత్తేసిన టిడిపి

***స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే కూడా ఇంకా దారుణంగా ఉంది. జిల్లాలోని రెండు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలు వైసిపి గెలుచుకోవడం తెలిసిందే! ఆ ప్రభావం నుండి తెలుగుదేశం శ్రేణులు ఇంకా కోలుకోక పోగా, మరింత డీలాపడ్డాయి.***

ఈ తొమ్మిది నెలల కాలంలోనే కొందరు నాయకులు తెలుగుదేశం నుండి వైసీపీలోకి పోవడంతో పరిస్థితులు మారాయి. కొన్ని నియోజకవర్గాలలో నాయకులు పట్టించుకోని పరిస్థితి. స్థానిక ఎన్నికలు అంటేనే మాకు సంబంధం లేనట్లుగా అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన నాయకులు వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో పూనుకుంటే డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తుందని వాళ్ళ భయం. అందుకే చాలా వరకు ఎన్నికలకు దూరంగా ఉంటున్నారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికల దాకా వాళ్లు తమ నియోజకవర్గాల వైపు చూసే పరిస్థితి కూడా లేదు. కొన్ని నియోజకవర్గాలలో ద్వితీయ శ్రేణి లీడర్లు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ వార్డుల్లో నామమాత్రపు పోటీ పెట్టడానికి ముందుకొచ్చారు. రాజకీయ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా నెల్లూరు జిల్లాలో 12 జడ్పీటీసీలు వైసిపి ఏకగ్రీవంగా కైవసం చేసుకుందంటే.. తెలుగుదేశం ఎంత దారుణమైన స్థితిలో ఉందో అర్థమవుతుంది. ఇప్పుడు ఎన్నికలు వాయిదాపడినా, రేపు ఆరు వారాల తర్వాత ఎన్నికలు జరిగినా రాబోయే ఫలితాల్లో పెద్ద మార్పు ఉండదు. పలు నియోజకవర్గాలలో కొన్ని జడ్పీటిసి, ఎంపీటీసీ స్థానాలలో అభ్యర్థులుగా కొందరిని బ్రతిమలాడి నిలబెట్టుకున్నారు. టీడీపీ కంటే కూడా బీజేపీ, జనసేన పార్టీలే స్థానిక ఎన్నికల్లో కొంచెం నయమనిపించాయి. ఎందుకంటే కనీసం కార్యకర్తలు ఆ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి ముందుకు వచ్చారు. స్థానిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ టికెట్ అంటేనే నాయకులు మాకొద్దు బాబు అంటూ పరుగులు తీశారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## నెల్లూరు కబుర్లు

# ముగిసిన ఇంటర్ పరీక్షలు



ఈ నెల 18వ తేదీతో ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిశాయి. ఈనెల 4వతేదీ నుండి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు మొదలు కావడం తెలిసిందే! మొత్తం 87 కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. 18వతేదీ చివరి పరీక్ష వ్రాశాక విద్యార్థులు పరీక్షా కేంద్రాల నుండి బయటకొచ్చి వ్యాన్‌లలో తమ హాస్టల్స్‌కు, ఇళ్ళకు వెళుతూ రోడ్ల వెంబడంతా కేరింతలు కొట్టారు.

### కరోనా నోడల్ అధికారిగా
# ఏఎస్పీ వెంకటరత్నం

జిల్లాలో కరోనా వైరస్‌కు సంబంధించిన కేసు పాజిటివ్‌గా నమోదు కావడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పలు శాఖల నుంచి అధికారులు ఈ వ్యాధిపట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు సమాయత్తమవుతున్నారు. జిల్లా పోలీసు శాఖ నుంచి ఈ వ్యాధి నివారణకు నోడల్ అధికారిగా ఏఎస్పీ వెంకటరత్నంను ఎస్పీ భాస్కర్‌భూషణ్ నియమించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి తర్వాత ఇతర దేశాల నుంచి నెల్లూరుకు వచ్చినవారి జాబితాను తయారుచేస్తున్నారు. వారికి కరోనా వ్యాధి కణాలు ఉన్నాయా లేదా అనే కోణంలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కరోనా వైరస్ పట్ల అప్రమత్తంగా ఉంటూ, పోలీసుశాఖలో విధులు నిర్వహించే సిబ్బందికి ఈ వ్యాధి వ్యాపించకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

### రంగడి హుండీ ఆదాయం
# రూ.9.86 లక్షలు

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈనెల 16 న హుండీలను లెక్కించారు. బ్రహ్మోత్సవాల ద్వారా రూ.9,86,458 లు ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమ పర్యవేక్షకులుగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్‌కె చైతన్య వ్యవహరించారు.



# అమరజీవికి నివాళులు

ఈనెల 16వ తేదీన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి, అలాగే ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కెవి చలమయ్య, పలువురు రాజకీయ నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది.



# వైసీపీలోకి హరిబాబు



తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిహెచ్ హరిబాబుయాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేశాడు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే నాయకత్వంలో ఆయన వైసిపి వైపు అడుగులు వేశాడు. హరిబాబుయాదవ్ ఒకప్పుడు కాంగ్రెస్ నాయకుడు. 2014 ఎన్నికలలో టిడిపిలో చేరాడు. అప్పటివరకు మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మీకి కుడిభుజంగా వ్యవహరించాడు. ఇప్పుడు టిడిపి నుండి ఒకప్పటి కాంగ్రెస్ నాయకులంతా వైసీపీలోకి క్యూ కట్టారు కాబట్టి హరిబాబు కూడా ఆ క్యూలోకి వచ్చి చేరాడు.

### యానాదుల అభ్యున్నతికి
# 'జయభారత్' కృషి
### - స్వామి దయానంద

యానాదుల అభ్యున్నతికి, వారిలో ఆధ్యాత్మిక చైతన్యం తెచ్చేందుకు నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రి వారు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని దత్తాత్రేయ పీఠం స్వామి దయానంద అన్నారు. ఈనెల 14న ఆయన జయభారత్ ఆసుపత్రిలో శ్రీ వేంకటేశ్వర స్వామికి యానాదుల సమారాధన మహోత్సవ ఆహ్వాన గోడపత్రికను ఆవిష్కరించారు. సింహపురి సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామీజీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా యానాదు లందరినీ ఏకం చేయాలన్నారు. యానాదుల జన్మ జాగరణ వేదిక జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఈగ రామయ్య మాట్లాడుతూ ఏప్రిల్11వ తేదీన భగవాన్ వెంకయ్యస్వామి కొలువై ఉన్న గొలగమూడిలో జరిగే మహోత్సవానికి యానాదులందరూ తరలిరావాలని కోరారు. సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోట సునీల్, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత భయ్యా శ్రీనివాసులు, జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, నాగిరెడ్డి, హరికుమార్‌రెడ్డి, గుర్రం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేశాఖ అప్రమత్తం

రైలు ప్రయాణీకులకు కరోనా వైరస్ సోకకుండా దక్షిణమధ్య రైల్వే శాఖ అప్రమత్తమైంది. రైళ్లలోని ఏసి కోచ్‌లలో ప్రయాణీకులకు ఉలెన్ దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని, ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా అన్ని రైల్వేస్టేషన్లు, ప్లాట్‌ఫాంలు, ప్రయాణీకులు కూర్చునే స్థలాలు, కిటికీలు..ఇలా అన్ని ప్రాంతాల్లో ఎలాంటి క్రిములు, వైరస్‌లు చేరకుండా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపడుతున్నామని దక్షిణమధ్య రైల్వే పిఆర్‌ఓ సిహెచ్ రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# గాంధీజీ సత్యనిష్ఠ అపూర్వం



గాంధీజీకి నివాళులర్పిస్తున్న బొగ్గరపు, రొంపిచర్ల

మహాత్మా గాంధీజీ సత్యనిష్ఠ అపూర్వం, అసామాన్యమని, సామాన్య కుటుంబంలో జన్మించిన గాంధీజీ స్వయంకృషితో మహనీయశక్తిగా ఎదిగి ప్రపంచస్థాయి కీర్తిని సముపార్జించుకున్నారని, భారతదేశ చరిత్రలో మహాత్మునిగా, మానవీయ మూర్తిగా శాశ్వత స్థానం సాధించారని.. ఆయన ఆశయాల బాటలో అందరం నడవాలని ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి అన్నారు.

ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు గ్రామంలో ఉన్న పినాకిని సత్యాగ్రహాశ్రమంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 'మహాత్మాగాంధీ-మానవత్వం' అనే అంశంపై ఉపన్యసించారు. తొలుత ఆశ్రమంలోని గాంధీజీ విగ్రహానికి ఖద్దరుశాలువా, నూలుదండతో ఘనంగా నివాళులర్పించారు. గాంధీ సిద్ధాంత ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంపిచర్ల శివరామయ్య ఆధ్వర్యంలో పల్లిపాడులోని ఉపాధ్యాయ శిక్షణాసంస్థ (డైట్) విద్యార్థులతో జరిగిన ఈ సమావేశంలో అనేకమంది పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు. అనంతరం బొగ్గరపు రాధాకృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు.

### జిల్లా ప్రజావాకర్స్
# నూతన కమిటీ ఎన్నిక



నెల్లూరు పొదలకూరురోడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో ఈనెల 15న జిల్లా ప్రజా వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చలంచర్ల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా మెట్టు సుధాకర్ రెడ్డి, కోశాధికారిగా చెంచయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎ.నరశింహులు, వి.హర్షవర్ధని, షేక్ ఖాజామస్తాన్, వై.శివశంకరయ్య, మహిళా కార్యదర్శిగా హరిసుధ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శులుగా మండవ శ్రీనివాసరావు, యల్.నాగేశ్వరరావు, కో-ఆర్డినేటర్‌గా బి.రాజగోపాల్, జాలీవాకర్‌గా యంవి కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా వియస్ ప్రసాద్,సియల్ ప్రసాద్, ఎస్తేరు రాణి, టూరిజం వై.దయాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సంస్థ కార్యదర్శి మెట్టు సుధాకర్‌రెడ్డి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

# విశ్రాంత పోలీసులకు సత్కారం

విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 13న 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత పోలీసులను సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఏఎస్పీ(అడ్మిన్) వెంకటరత్నం పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పోలీసులు ఆర్.సుబ్బరాయుడు, బి.శేషగిరి రావు, ఆదిశేషయ్య, సీహెచ్ సల్మాన్, మునికృష్ణయ్య, కె.సౌందర్‌రాజన్, బి.వెంకటస్వామి, ఎం.ఉస్సేన్, ఏ.పెంచలయ్య, బి. వెంకటేశ్వర్లు, సీహెచ్ సుబ్రహ్మణ్యంలను సత్కరించారు. విశ్రాంత పోలీసు అధికారులు సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు శ్రీహరి, అధ్యక్షుడు టి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంతో...
# నిండు ప్రాణం పోయింది



- రైలు క్రిందపడి మృతిచెందిన వీఆర్ లా కళాశాల విద్యార్థి
- సెల్‌ఫోన్ రూపంలో మృత్యువు మింగింది

నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. సెల్‌ఫోన్ ముచ్చట్లలో మునిగిపోయాడో లేక మ్యూజిక్ వింటున్నాడో.. చెవులకు ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని రైల్వేట్రాక్ దాటబోయాడు నెల్లూరు వీఆర్ లాకాలేజీ విద్యార్థి రామ్‌ప్రతాప్‌రెడ్డి. అదే సమయంలో అటుగా వస్తున్న రైలుని ఆ విద్యార్థి గమనించలేదు. సెకన్ల వ్యవధిలో ఘోరం జరిగిపోయింది. రైలు ఢీకొనడంతో విద్యార్థి దేహం నుజ్జునుజ్జయింది. అక్కడే ప్రాణం పోయింది. వందమీటర్ల దూరంలో కాలేజీ, ట్రాక్ దాటితే క్లాస్‌లోకి వెళ్లాల్సిన వాడు. అంతలోనే ఘోరం జరిగింది. బుచ్చి ప్రాంతం నుంచి కాలేజీకి వచ్చే రామ్‌ప్రతాప్‌రెడ్డి ప్రతిరోజూ పూలే బొమ్మ దగ్గర బస్సుదిగి.. అక్కడినుంచి కాలినడకన కాలేజీకి వచ్చేవాడు. ఈ క్రమంలో రోజూ రైల్వే ట్రాక్ దాటేవాడు. అప్రమత్తంగా లేకపోవడంతో.. రైలు ఢీకొని దుర్మరణంపాలయ్యాడు.


# బెగోరె డిగ్రీ కాలేజీ వార్షికోత్సవ వేడుకలు



నెల్లూరు దర్గామిట్టలోని డా. బెజవాడ గోపాల రెడ్డి డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఈనెల 13న ఎంతో ఘనంగా జరిగాయి. బిఇడి కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల కరెస్పాండెంట్ జవిరెడ్డి చేతుల మీదుగా బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్స్‌కు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థినుల నాట్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ మృదుల, భార్గవి ఆటోమొబైల్స్ అధినేత కొండా బలరామరెడ్డి, రొటేరియన్ సనత్ కుమార్‌రెడ్డి, ఏ.ఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# కరోనా.. కాసుకో!



ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ నెల్లూరుజిల్లా తలుపు తట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి కేసు నెల్లూరు నగరంలో నమోదు కావడం గమనార్హం. ఇటలీ నుంచి వచ్చిన నెల్లూరుకు చెందిన విద్యార్థికి వైద్యపరీక్షల్లో వైరస్ పాజిటివ్‌గా తేలడంతో నెల్లూరు పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డులో ఆ విద్యార్థికి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అలాగే ఆయన నుండి వారి కుటుంబసభ్యులకు, ఇంట్లో పని చేసేవారికి ఆ వైరస్ సోకిందా అనే అనుమానంతో వారికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ రిపోర్ట్ వచ్చింది. వైరస్ సోకిన విద్యార్థి కూడా కోలుకున్నట్లుగా తెలుస్తోంది. ఇటలీ నుండి వచ్చిన ఈ విద్యార్థి మొదట ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో దిగాడు. అయితే అక్కడ స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరుకాకుండా నేరుగా నెల్లూరు వచ్చేశాడు. ఢిల్లీ ఎయిర్ పోర్ట్ సిబ్బంది ఆ విద్యార్థి పరీక్షలు చేయించుకోని విషయాన్ని గమనించి నెల్లూరు పోలీసులకు సమాచారం అందించడంతో ఇక్కడి పోలీసు సిబ్బంది, వైద్య శాఖ సిబ్బందితో కలిసి ఆ విద్యార్థి అడ్రస్ పట్టుకొని ఆస్పత్రికి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇటలీ నుంచి వచ్చాక విద్యార్థి బయట పెద్దగా తిరగకపోవడంతో వైరస్ వ్యాప్తి చెందే అవకాశం కూడా తగ్గింది.

ఇక కరోనా వైరస్‌ను ఎదుర్కొనే విషయంలో జిల్లా అధికార యంత్రాంగం అత్యంత సమర్ధవంతంగా పని చేస్తోంది. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు ఈ విషయంలో చూపిన చొరవ ఎంతైనా అభినందనీయం. వైరస్ ప్రభావం నెల్లూరుజిల్లాపై పడకముందే ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ యంత్రాంగాన్నంతా అప్రమత్తం చేశారు. పెద్దాసుపత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పరిచారు. అన్ని పాఠశాలలకు ఈ నెల 22వ తేదీ వరకు శెలవులు ఇచ్చేశారు. జనం ఎక్కువగా ఉండే జాతరలపై ఆంక్షలు విధించారు. స్విమ్మింగ్‌పూల్స్ క్లోజ్ చేశారు. అలాగే ఎంతో మంది ప్రజలు ప్రభావితం అయ్యే హాల్స్, మాల్స్ మూయించారు. ప్రజలలో కరోనా వైరస్‌పై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వైరస్ పట్ల ప్రజలు కూడా పూర్తి అప్రమత్తమై తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సినిమా హాల్స్‌కు పోవడం మానేశారు. నగరంలో దాదాపు కొంత బంద్ వాతావరణం కనిపిస్తోంది!

# ఏకగ్రీవాలు రద్దు చేయాలి



**- భరత్‌కుమార్**

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని, ఎన్నికల కమిషన్ కరోనా వైరస్ ప్రబల కుండా రాష్ట్రంలో ఎన్నికలు వాయిదా వేయడాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 15న నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ చూడని విధంగా నామినేషన్ల ప్రక్రియను వైసీపీ పాలనలో చూశామని, నామినేషన్ పత్రాలు బలవంతంగా లాక్కోవడం, అభ్యర్థులను బెదిరించడం, దాడులు చేయడం తదితర వైసీపీ నాయకుల అరాచకానికి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని చూస్తున్న ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో పూర్తిగా ఎన్నికల ప్రక్రియను రద్దు చేయాలన్నారు. రౌడీయిజంతో వైసీపీ అభ్యర్థులు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నారని, వారిని తొలగించి రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో మరలా నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ముక్కు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదు..



**- చేవూరు దేవకుమార్‌రెడ్డి**

తన 40 ఏళ్ళ రాజకీయ ప్రస్థానంలో ఇలాంటి స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడూ చూడలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి విమర్శించారు.

ఈనెల 15న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఏకపక్షంగా ఎన్నికల ఫలితాలు సాగేలా అధికారపార్టీ రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. దీనికి కొంతమంది అధికారులు సహకరించడంతో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. తమ పార్టీ తరఫున సూళ్ళూరుపేటలో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీలో నిలబెడితే వైసీపీ నాయకులు ఆయనతో బలవంతంగా విరమింపజేశారన్నారు. జిల్లా పరిషత్ సభ్యులుగా 43 మందితో నామినేషన్లు వేయించామని ఇందులో 19 మంది అభ్యర్థులతో బలవంతంగా విత్‌డ్రాలు చేయించారన్నారు.

జడ్పీటీసీ పోటీలో వున్నవారి జాబితా ఇవ్వమని పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికల అధికారులను అడిగితే ఇవ్వలేదన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే కొన్ని చోట్ల అభ్యర్థులను బెదిరించడం, ఒత్తిళ్ళకు గురిచేయడం బాధాకరమన్నారు.

## అధికారం కోల్పోతే...

# ఇంత అసహనమా..!

**- ఆనం విమర్శ**



అధికారం కోల్పోయిన తొమ్మిది నెలలకే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులో ఇంత అసహనం ఏంటని వెంకటగిరి శాసన సభ్యుడు ఆనం రామనారాయణరెడ్డి విమర్శించాడు.

ఈనెల 16వ తేదీన నెల్లూరులోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోయిన అసహనంతో చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూడడం సమంజసం కాదన్నాడు. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రానికి నష్టమే తప్ప ప్రయోజనం లేదన్నాడు. ప్రభుత్వ వ్యవస్థలను మేనేజ్ చేయడంలో రాటుతేలిన చంద్రబాబునాయుడు పాడుబుద్ధితో రాష్ట్ర ఎన్నికల వ్యవస్థను మేనేజ్ చేసి స్థానిక ఎన్నికలు వాయిదా వేయడం దుర్మార్గపు చర్యగా ఆయన అభివర్ణించాడు. ఈ నెలాఖరులోపు స్థానిక ఎన్నికలు జరిగితే రాష్ట్రానికి 5వేల కోట్ల నిధులు వస్తాయనే సంగతి చంద్రబాబుకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. మార్చిలోపు ఎన్నికలు జరగకపోతే రాష్ట్రానికి ఒక్క రూపాయి వచ్చే పరిస్థితి కూడా లేదన్నాడు. జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందకూడదనే ధోరణిలో చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించాడు. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ చివరి దశలో ఉండగా ఈ సమయంలో ఎన్నికలను వాయిదా వేయడం కరెక్ట్ కాదని ఆయన పేర్కొన్నాడు. రాష్ట్రంలో ఎక్కడా కరోనా వైరస్ లేదని, నెల్లూరులో ఒక కేస్ వుంటే.. దానిని కూడా దాదాపు బాగుచేశామని చెప్పాడు. రాష్ట్ర ఉన్నతాధికారులతో సంప్రదించకుండా ఏకపక్షంగా ఎన్నికలను వాయిదా వేయడం తగిన పని కాదని ఆయన అన్నాడు.

# ఆనం అరుణమ్మకు సత్కారం

నెల్లూరు జడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా ఎంపికైన ఆనం అరుణమ్మను నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఈనెల 15న ఆమె నివాసంలో కేక్ కట్ చేసి సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు, కుమార్ పాల్ తదితరులు మాట్లాడుతూ డీసీసీబీ ఛైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి సతీమణి జడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా ఎంపిక కావడం తమకెంతో ఆనందాన్నిచ్చిందన్నారు. అరుణమ్మ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు తమను సత్కరించడం ఆనందదాయకమని వారి అభిమానాన్ని ఎన్నటికి మరచిపోలేనని అన్నారు. డీసీసీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎన్ రమేష్ బాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కేఆర్‌పీ కుమార్‌పాల్, శ్రీనివాసమూర్తి, బాబు, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.




శ్రీమతి వేమారెడ్డి కృష్ణమ్మ గారు
మరణం : 14.03.2020
W/o కీ॥శే॥ వేమారెడ్డి రంగారెడ్డి గారు
వరగలి

## ఉత్తరక్రియలు

మా ఉన్నతికి కృషి చేసి,
ఆప్యాయతానురాగాలు పంచిన
అమృతమూర్తి, మా ఇంటి దైవం
**శ్రీమతి వేమారెడ్డి కృష్ణమ్మ గారు**
W/o కీ॥శే॥ వేమారెడ్డి రంగారెడ్డి గారు, వరగలి
తే.14.03.2020ది
శనివారం స్వర్గస్తురాలైనారు.
వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

**ఉత్తరక్రియలు:**
తేది. 26.3.2020 గురువారం,
నెల్లూరు, సుజాతమ్మకాలనీలోని
లీలాఫ్లోరా అపార్ట్‌మెంట్‌లోని
మా స్వగృహమునందు జరుగును.

కుమారుడు :
**వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి**
మాజీచైర్మెన్, శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ దేవస్థానం, తూర్పుకనుపూరు
మనుమడు :
**వేమారెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి**
మరియు కుటుంబసభ్యులు

**సహపంక్తి(భోజనాలు) :**
తేది. 26.03.2020 గురువారం ఉదయం 11.30 గంటలకు
నెల్లూరు, కస్తూరిదేవి స్కూలు, రవీంద్రనాథ్ ఠాగూర్ హాలు
నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# వైభవంగా ముగిసిన రంగడి బ్రహ్మోత్సవాలు

## నేత్రపర్వంగా రంగనాధుని తెప్పోత్సవం



నెల్లూరు రంగనాయకులపేటలో పినాకినీ నదీ తీరాన ఉత్తర శ్రీరంగంగా కీర్తింప బడుతున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఈనెల 15న వైభవంగా ముగిశాయి. చివరి రోజు ముగింపు సందర్భంగా సాయంత్రం పెన్నానదిలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. రంగనాథుడు వేణుగోపాలుని అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేతంగా తెప్పలో దర్శన మిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారి జలవిహారాన్ని తిలకించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన తెప్ప కనువిందు చేసింది. ముందుగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో శ్రీవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి తెప్పలో కొలువుతీర్చారు. బాణాసంచా వేడుకలతో, భక్తుల గోవిందనామ స్మరణలతో శ్రీ స్వామివారు తెప్పలో విహరించారు. ఈ ఉత్సవాన్ని రంగనాథస్వామి వారి భక్త బృందం నిర్వ హించింది. అంతకుముందు శ్రీ స్వామివారికి అశ్వవాహనసేవ, ముసుగుల సేవ, పుష్పయాగం, ధ్వజావరోహణం కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యులు ఈ ఉత్సవాలను పర్యవేక్షించారు.



### కరోనా నేపథ్యంలో.. ముత్యాలమ్మ జాతరకు..

# స్థానికులకే అనుమతి

ఈనెల 17 నుంచి 20వ తేది వరకు వైభవోపేతంగా జరిగిన ముత్యాలమ్మ జాతరకు స్థానిక గ్రామాల ప్రజలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. కరోనా భయం పెరుగుతుండడంతో విదేశాల నుంచి వచ్చే భక్తులకు, ఇతర దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి ఆయా కుటుంబ సభ్యులు ఈసారికి ప్రయాణం వాయిదా వేసుకుని సహకరించాలని కోరారు. చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ జాతర ప్రతిఏడాది అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఈసారి కూడా జాతరకు భారీ ఏర్పాట్లు చేశారు. ముత్యాలమ్మకు, పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 17వతేది రాత్రి పోలేరమ్మ అమ్మవారి నిలుపు, 18న యార గురునాధస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవం, గొల్లల వేడుకలు, 19వ తేది పగలు గురునాధస్వామి గ్రామోత్సవం, రాత్రికి అమ్మణ్ణి ఉయ్యాలసేవ, 20వ తేదీ శుక్రవారం ఉదయం పోలేరమ్మను సాగనంపే ఉత్సవం వైభవంగా జరిగాయి. అయితే కరోనా నేపథ్యంలో పంచాయతి పరిధిలోని ఈదలవారిపాళెం, అద్దేపల్లి, పోసినవారిపాళెం, రాములవారి పాళెం గ్రామాల ప్రజలను మాత్రమే జాతరకు అనుమతించడం జరిగింది. స్థానికులు మాత్రమే జాతరలో పాల్గొనాలని గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు ఆ మేరకు ప్రజలకు అవగాహన కల్పించారు. జాతర ఏర్పాట్లను ఆలయ ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### మునిసిపాలిటీతోనే...

# విలీన గ్రామాల అభివృద్ధి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కనుమూరు హరిచంద్రారెడ్డి

గూడూరు పట్టణ పరిసరప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలు, నాయకులు ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం గూడూరు మునిసి పాలిటీలో విలీనం చేసేందుకు ముం దుకురావాలని వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కనుమూరు హరిచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరు మునిసిపాలిటీ 1952లో ఏర్పడగా, 1984లో గ్రేడ్-2 మునిసిపాలిటీ అయ్యిందని, అయితే గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా గూడూరుకు గ్రేడ్-1 మునిసిపాలిటీ హోదా లభించలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చొరవతో గూడూరు మునిసిపాలిటీకి గ్రేడ్-1 హోదా లభించిందని పేర్కొన్నారు. అయితే ఈ ప్రక్రియలో భాగంగా గూడూరు పట్టణ సమీపంలో ఉన్న గ్రామాలను మునిసిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఆయా గ్రామాల్లో కొంతమంది ఈ విలీనాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్ళడంతో మునిసిపాలిటీకి ఎన్నికలు జరగకుండా నిలిచిపోయాయన్నారు. విలీనగ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పడాలంటే మునిసిపాలిటీలో విలీనం అయితే అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతాయన్నారు. దీనిపై కేసులు వేసిన వారు ఆ కేసులను ఉపసంహరించుకుని ఎన్నికలు జరిగేలా సహకరించాలని, తద్వారా గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు రవీంద్రబాబు, భానుప్రకాష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరోనాపై విస్తృత ప్రచారం




మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌వో అచ్యుతకుమారి, పక్కన సి.ఐ దశరథరామారావు తదితరులు

ప్రతిఒక్కరూ పరిశు భ్రంగా ఉంటే కరోనా వైరస్ దరిచేరదని డిప్యూటీ డిఎం హెచ్‌వో డాక్టర్ అచ్యుత కుమారి తెలిపారు. గూడూరు పట్టణం లోని సిఆర్ మార్కులో మంగళవారం పట్టణ సిఐ దశరథరామారావు ఆధ్వ ర్యంలో పోలీసులకు కరోనా వైరస్ నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధిగా చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా కరోనా వైరస్‌ను నివారించవచ్చునని తెలిపారు. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీంలు, చల్లని పదార్థాలు సేవించకూడదని, వేడినీటిని ఎక్కువగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రిజిత, పట్టణ ఎస్సై సైదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ఆంధ్ర రాష్ట్ర సాధకుడు..

# పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న గూడూరు తహశీల్దార్ లీలారాణి

ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం ప్రాణాలను సైతం లెక్కచేయని ధీరుడు.. మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములని గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ కొనియాడారు. ఈనెల 14న శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బాల లీలా రాణి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ ఓబులేశు, మేనేజర్ కృష్ణారెడ్డి, పురపాలక సంఘం అధికారులు పాల్గొని శ్రీ పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గూడూరులోని గడియారపు స్తంభం కూడలివద్ద ఉన్న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ గౌరవాధ్యక్షులు సోమిశెట్టి చెంచురామయ్య, డి.సుధీర్, రామ్మోహన్‌రావు, వర ప్రసాద్, వల్లంకొండ సతీష్, సురేష్, బుజ్జి, మోహన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు



నెల్లూరులోని టౌన్‌హాలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన త్యాగరాజస్వామి స్మరణోత్సవాల్లో ఈనెల 16వ తేదీన గానం చేస్తున్న చెన్నూరు శ్రీ రమ్య.



నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

# బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

**- ఫోటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్**

గూడూరు పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్, ఫోటో వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ నాయకుడు చిరంజీవి గౌడ్, ఫోటోగ్రాఫర్ల ప్రతినిధి ఖాదర్‌హుస్సేన్‌ల మృతికి సంతాపం వ్యక్తంచేస్తూ ఈనెల 15న సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ అందరితో ఎంతో సఖ్యంగా ఉండేవారు గుండె పోటుతో ఇటీవల ఆకస్మికంగా మృత్యువాత పడడం బాధాకర మన్నారు. వీరిరువురి మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఫోటో, వీడియోగ్రాఫర్ల తరపున బాధిత కుటుంబాలను ఆదుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దొంతు శ్రీధర్, ఎస్‌కె అల్తాఫ్, చెన్నుపల్లి ప్రభాకర్, సుధాకర్‌నాయుడు, వెంకటేశ్వర్లు రాజు, శీను, రమేష్, సలీమ్, రాజా, రత్నం తదితరులు పాల్గొన్నారు.

### వైజేపి లయన్స్ ఆధ్వర్యంలో

# పలసరుకుల పంపిణీ



పేదలకు పలసరుకులు అందజేస్తున్న డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, రోహిణి

గూడూరులోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్‌క్లబ్ వైజేపి ఆధ్వర్యంలో ఈనెల16న పలసరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలా నిర్వహించే ఈ కార్యక్రమానికి గూడూరు లోని ప్రముఖ వైద్యులు డాక్టర్ సిఆర్‌రెడ్డి ప్రధాన దాతగా వ్యవహ రిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డాక్టర్ చెరుకూరు జనార్ధన్‌రెడ్డి, రోహిణిలు పాల్గొని మాట్లాడుతూ వృద్ధులను నిరా దరణకు గురిచేయరాదన్నారు. ఈ సందర్భంగా వారికి సాయంగా లక్ష రూపాయల శాశ్వతనిధిని అందజేస్తామని డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, రోహిణి దంపతులు హామీ ఇచ్చారు. అనంతరం పేదవారికి పలసరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు దశరథరామిరెడ్డి, ముప్పాళ్ళ మురళీరాజు, చంద్రశేఖర్‌రెడ్డి తది తరులు మాట్లాడుతూ దాత కనుమూరు హరిచంద్రారెడ్డి ఈ కార్యక్రమానికి అందజేస్తున్న సహకారాన్ని గుర్తుచేసుకున్నారు.

### చంద్రబాబు వ్యాఖ్యలతో...

# పోలీసుల మనోభావాలు దెబ్బతిన్నాయి

మాజీ మఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలతో పోలీసుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు శ్రీహరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శేషయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యస్కె గౌస్ బాషా తెలిపారు. ఈనెల 15న నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాకీ టెర్రరిజం సాగుతుందని చంద్రబాబు వ్యాఖ్యానించడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. పోలీసులకు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎనిమిది నెలల కిందటి వరకు తాము చంద్రబాబు ప్రభుత్వంలో పనిచేశామని, అప్పుడు కితాబు ఇచ్చిన బాబు జగన్ ప్రభుత్వంలో చట్టపరంగా తాము విధులు నిర్వహిస్తుంటే ఉగ్రవాదులుగా కనిపిస్తున్నామా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు కష్టపడుతుంటే శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని వ్యాఖ్యానించడం దురదృష్టకరమన్నారు. ఈ వ్యాఖ్యలపై తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు.

# కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కరోనా వైరస్ సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయుష్ ఆర్‌జేడి డాక్టర్ వెంకట్రామనాయక్ అన్నారు. నెల్లూరు ఫతేఖాన్‌పేటలోని సచివాలయం, మద్రాస్ బస్టాండ్ సమీపంలోని మునిసిపల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ రాకుండా తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తచర్యలను తెలియజేశారు. అనంతరం హోమియో మందులు పంపిణీ చేశారు. ఆయుష్‌శాఖ వైద్యుడు సుబ్బరాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి బస్టాండ్‌లో అవగాహన

నెల్లూరు నగరంలోని ఆర్టీసి బస్టాండ్‌లో ప్రయాణీకులు, సిబ్బందికి ఆర్టీసి అధికారులు కరోనా పట్ల అవగాహన కలిగించారు. కరోనా రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అందరికీ అవగాహన కోసం కరోనా వ్యాధి నివారణ గురించి బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఆర్టీసి 1వ డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు, హెచ్ఇఓ లక్ష్మీనారాయణ, శ్రీధర్, కంట్రోలర్ కృష్ణయ్య, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర కార్యదర్శి నాగరాజు, రూరల్ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాయిదా కాదు.. రద్దు చేయాలి!

**- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు**

స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా కాకుండా రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. ఈనెల 15న నెల్లూరు సీపీయం జిల్లా కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ఆరు వారాల పాటు వాయిదా వేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని, ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల ప్రక్రియను కూడా రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో చాలా చోట్ల అధికార పార్టీ అరాచకాలకు పాల్పడి ఎన్నికల్లో ఇతర పార్టీల అభ్యర్థులు పోటీలో లేకుండా బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడిందని ఆరోపించారు. కరోనా ప్రభావంతో ఈసీ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా వుందన్నారు. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్ అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయానికి రావాలని కోరారు. శ్రీరాములు, గోగుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

### వ్యక్తిగత పరిశుభ్రతతో..

# కరోనా దూరం

**- ఆర్‌బిఎస్‌కె సమన్వయకర్త వెంకటేశ్వర్లు**

వ్యక్తిగత పరిశుభ్రతతో కరోనా వైరస్‌ను దూరం చేసుకోవచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిశుభ్రతతో ఉండాలని ఆర్‌బిఎస్‌కె సమన్వయకర్త వెంకటేశ్వర్లు సూచించారు. ఈనెల 14న నెల్లూరు రూరల్‌లోని ఆటోనగర్‌లో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో పిఎంపి అసోసియేషన్, వైద్యఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కరోనా రాకముందే ప్రజలు ముందుజాగ్రత్తలు పాటించాలన్నారు. కరోనా వస్తే దానిని నివారించేందుకు ఎలాంటి మందులు లేవని, కనుక వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించడమే అన్ని విధాలా శ్రేయోదాయకమని అన్నారు. కరోనా వైరస్ గాలిలో ఉండిపోదని, అది వెంటనే నేలకు చేరిపోతుందని, చేతులపై కేవలం పది నిమిషాల పాటు ఉంటుందని, అందువల్ల పదేపదే సబ్బులతో చేతులను పరిశుభ్రం చేసుకోవడం ద్వారా ఈ వైరస్‌ను నివారించుకోవచ్చని అన్నారు. ప్రజల్లో ఈ వ్యాధిపట్ల భయాన్ని కాక, అవగాహన పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఓ కాంతారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు, పిఎంపి నాయకులు శాకవరపు వేణుగోపాల్, సత్తార్, రూడ్స్ సంస్థ జిల్లా అధ్యక్షుడు రసూల్, పిహెచ్‌సి సమన్వయకర్త వెంకటేశ్వర్లు, శేషయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వియస్‌యుకి సెలవులు

విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం, కావలి పీజీ కేంద్ర విద్యార్థులకు ఈనెల 29 వరకు తాత్కాలికంగా సెలవులను ప్రకటిస్తున్నట్లు వీయస్‌యూ రిజిస్ట్రార్ అందె ప్రసాద్ ఈనెల 16న ఒక ప్రకటనలో తెలిపారు. వీయస్‌యూ, కావలి పీజీ కేంద్రంలోని వసతి గృహాలను మూసివేస్తున్నట్లు తెలిపారు. మార్చి30న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు కరోనా బారిన పడకుండా తగిన నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బహుమానం

(5వ పేజీ తరువాయి)

శ్రీమంత్‌రెడ్డిని సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మెన్ అభ్యర్థిగా ముందుగానే నిర్ణయించాడు. ఆయన ఎంపికలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కూడా ప్రధాన పాత్ర పోషించాడు. శ్రీమంతురెడ్డికి పార్టీపరంగా న్యాయం చేయాల్సిన బాధ్యతను జగన్ ఎప్పుడో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి అప్పగించాడు. అది ఇప్పటికి నెరవేరబోతోంది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, రాజారెడ్డి తనకు అందించిన సహకారం దృష్టిలో పెట్టుకొని ఆ కుటుంబానికి న్యాయం చేయడం కోసం ఎంతో కృషి చేశారు. ఇప్పుడు శ్రీమంతురెడ్డిని చైర్మన్ చేయడం కోసం గట్టిగా పోరాడుతున్నాడు. జగన్మోహన్‌రెడ్డిని నమ్ముకుంటే ఏ రూపంలో న్యాయం జరుగుతుంది అనేదానికి శ్రీమంతురెడ్డి ఉదంతం ఒక ఉదాహరణ.

శ్రీను గల్పిక

# జగన్‌ను భయపెట్టిన చంద్రబాబు

అది తాడేపల్లిలోని స్పీడ్‌స్టార్, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నివాసం. జగన్‌మోహన్‌రెడ్డితో పాటు విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, పి.అనిల్‌కుమార్ యాదవ్, మేకతోటి సుచరిత, పుష్ప శ్రీవాణి, కొడాలి నాని, పేర్ని నాని తదితరులు ఉన్నారు. అక్కడే హాల్‌లో ఉన్న టీవీ ఆన్ చేసి సాక్షి ఛానల్ పెట్టాడు సజ్జల రామకృష్ణారెడ్డి. అప్పుడే వార్తలు వస్తున్నాయి... స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా 125 జడ్పీటీసీలు, 500కుపైగా ఎంపీటీసీలలో వైసిపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు న్యూస్ రీడర్ చెప్పింది. ఆ వార్త విని విజయ్‌సాయిరెడ్డి అక్కడ ఉన్న వారితో ఈ వార్త హైటెక్‌రత్న చంద్రబాబు చూశారంటే ఆయన కడుపుమంట తగ్గడానికి 100 ఈనో ప్యాకెట్‌లు కలుపుకొని తాగినా సరిపోదేమో అని అన్నాడు. అందుకు వై.వి.సుబ్బారెడ్డి మీరు చంద్రబాబును అంత తక్కువగా అంచనా వేయొద్దు, అతనికి ఎంత ఎక్కువ కడుపుమంట పెరిగితే అంత ఎక్కువ మంట మన రాష్ట్ర ప్రజల కింద పెడతాడు, అతను అరుంధతి సినిమాలో పశుపతి టైపు, కాబట్టి అతనికి కడుపుమంట రాకుండా ఉంటేనే మనకు మంచిది అని అన్నాడు. అంతలో అనిల్‌కుమార్‌యాదవ్ అందుకుని.. ఈ కరోనా వైరస్ వచ్చిన పరిస్థితుల్లో చంద్రబాబు సీఎంగా ఉండి ఉంటే 'దోమలపై దండయాత్ర' టైపులో 'కరోనాపై కత్తిసాము', 'కరోనా పై కత్తి తిప్పుదామ్' వంటి పేర్లతో ఒక ఐదు వేల కోట్లన్నా తినేసి ఉండేవాడు, ఆయన లేక పోబట్టి రాష్ట్రానికి 5వేల కోట్లు మిగిలినట్లు అయింది, ఏదో ఆ కేసీఆర్ అన్నట్లు పారాసిటమాల్ మాత్రలతో, మాస్కులతో నార్మల్ ఖర్చులతో కరోనా వైరస్‌ను ఎదుర్కొంటున్నాం అని అన్నాడు. అప్పుడు ఠక్కున జగన్ 5 వేల కోట్లు అంటే గుర్తొచ్చింది, ఈ నెలాఖరు లోపు స్థానిక ఎన్నికలు పూర్తి కాకపోతే రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఆగిపోతాయి. వైరస్ పేరు చెప్పి ఎలక్షన్ కమిషన్ ఎన్నికలు వాయిదా వేయదుకదా అని ఆతృతగా అన్నాడు. దానికి వైవి సుబ్బారెడ్డి ఉండి చంద్రబాబు మహా కంత్రి, మాయగాళ్లకు మాయగాడు, మోసగాళ్లకు మొనగాడు... ఆయన అనుకుంటే ఏదైనా చేయగలరు అని అన్నాడు. తర్వాత అందరూ ఇళ్లకు బయలుదేరారు. జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఇంట్లో పడుకుని తన చిన్నాన వైవి సుబ్బారెడ్డి చంద్రబాబు గురించి చెప్పిన మాటలను ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

అది విజయవాడలోని చంద్రబాబు నివాసం. ఆయన ఇంటి ముందు కొన్ని వేలమంది జనం పొగై సోకండాలు పెడుతున్నారు. ఆ అరుపులు విని చంద్రబాబు, ఆయన కొడుకు, యువ ప్రతిభారత్న నారా లోకేష్, ఆయన భార్య భువనేశ్వరి బయటకు వచ్చారు. బయట అంతమంది జనాన్ని చూసేసరికి భువనేశ్వరి ఠక్కున చంద్రబాబుతో ఏమండీ ఇక్కడ చాలా మంది జనం ఉన్నారు జోలె పెట్టొచ్చు కదా, ఏదన్న గిట్టుబాటు అవుతుందేమో అని అంది. దానికి చంద్రబాబు కోపంతో నాకు జీవితాంతం అడుక్కునేపనే అనుకున్నావా, ఏదో ఒకటి రెండు రోజులు ఆ పని చేశానని చెప్పి పర్మినెంట్‌గా అలాగే ఉండమంటావా అంటూ అక్కడికి వచ్చిన జనంతో ఏంటి మీ బాధ అని అడిగాడు. దానికి వాళ్ళు అయ్యా మీరు లేని లోటు మాకు ఇప్పుడు తెలుస్తుంది. మిమ్మల్ని ఓడించి తప్పు చేశాం, దోమల నిర్మూలన కోసమే 'దోమల పై దండయాత్ర' అంటూ వేల కోట్లు ఖర్చు పెట్టారు మీరు... అలాంటిది ఇప్పుడు మీరు ఉండుంటే 'కరోనాపై కత్తిసాము'తో రెండు వేల కోట్లు ఖర్చు పెట్టే వాళ్ళు, మా ప్రాణాలను కాపాడడానికి ఇంకెన్ని కోట్లు ఖర్చు చేయడానికైనా వెనకాడే వాళ్ళు కాదు. ముఖ్యంగా ఇలాంటి వాటి కోసం మీరు పెట్టే పథకాల పేర్లు ఎంతో వినసొంపుగా ఉండేవి. మీరు ఉంటే ఎలాంటి వైరస్ అయినా మమ్మల్ని ఏమీ చేయలేదనే ధైర్యం మాకు ఉండేది. రేపు స్థానిక ఎన్నికలలో ఓటు వేయడానికి కూడా మాకు భయమేస్తుంది. పోలింగ్‌బూత్‌లో కెళ్ళి ఓటేసి వస్తే కరోనా వైరస్ ఎక్కడ సోకుతుందోనని ఆందోళనగా ఉంది. ఈ ఎలక్షన్లను మీరే ఎలాగైనా వాయిదా వేయించాలయ్యా అని వాళ్లు వేడుకున్నారు. అప్పుడు చంద్రబాబు వారిని ఉద్దేశించి కరోనా వైరస్‌ని అరికట్టడం ఈ ప్రభుత్వం వల్ల కాదు, అదే నేను సీఎంగా ఉండి ఉంటే కత్తికి ఒక కండ లెక్కన కరోనా వైరస్‌ను నరికి కాకులకు గద్దలకు వేసేవాడిని, అసలు నేను సీఎంగా ఉన్న రాష్ట్రానికి ఆ వైరస్ రావాలంటేనే భయపడి ఉండేది. అయినా మీ తప్పు తెలుసుకున్నారు, నన్ను ఓడించినందుకు పశ్చాత్తాపడుతున్నారు, మీ కోరికను మన్నించి ఎన్నికలను వాయిదా వేయించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చాడు. అప్పుడు వచ్చిన జనాలంతా 'జయము జయము చంద్రన్న... జయము నీకు చంద్రన్న' అని పాట పాడ సాగారు. ఆ భజన పాట అరుపులు బాగా పెద్దవయ్యాయి. తమ ఇంట్లోని బెడ్రూంలోనుంచి జయము జయము చంద్రన్న అనే భజన పాట వినిపించడంతో వైయస్ భారతి పరిగెత్తుకుంటూ బెడ్‌రూమ్‌లోకి వచ్చింది. మంచం మీద పడుకుని రెండు చేతులతో తడుతూ ఆ పాట పాడుతున్న జగన్మోహన్ రెడ్డి మొహంపై నీళ్లు చల్లింది. అంతే ఠక్కున జగన్ లేచాడు. కళ్ళు తెరిచి చూస్తే ఎదురుగా భారతిరెడ్డి, అప్పటివరకు తనకు వచ్చింది కల అని, ఆ కలలో వచ్చినట్లే తాను కూడా చంద్రబాబు భజన పాట పాడినట్లు గ్రహించాడు. మంచం మీద నుండి లేచి హాల్లోకి వచ్చి టీవీ ఆన్‌చేసి సాక్షి ఛానల్ పెట్టాడు. అప్పుడే న్యూస్ రాసాగాయి... కరోనా వైరస్ ఎఫెక్ట్‌తో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ప్రకటిస్తున్నాడు. ఆ వార్త చూసి జగన్ షాక్ తిన్నాడు. ఆయన కళ్ల ముందు రాష్ట్రానికి రావాల్సిన 5 వేల కోట్లు కనిపించసాగాయి. తన బాబాయ్ చెప్పినట్లే, తన కలలో కనిపించినట్లు చంద్రబాబు స్థానిక ఎన్నికలను వాయిదా వేయించాడని అనుకున్నాడు. వెంటనే ఢిల్లీ వెళ్ళి కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి ఈ విషయం మీద పంచాయతీ పెట్టాడు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో ఏపీ స్థానిక ఎన్నికలపై పంచాయతీ జరుగుతుంది. ప్రధాని నరేంద్ర మోడీ, ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్, ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కడ ఉన్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ ఉండి ఈ ఎన్నికలు ఎందుకు వాయిదా వేశారని అడిగాడు. దానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమాధానమిస్తూ సార్ ఇప్పుడు ఏపీ సీఎంగా చంద్రబాబు లేరు, ఆయన సీఎంగా లేకుంటే అక్కడ వైరస్‌ను ఎదుర్కోవడం కష్టం, ఆయన సీఎం అయిన తర్వాత అక్కడ ఎన్నికలు పెట్టండి, అప్పటి వరకు ఆ రాష్ట్ర ప్రజలకు భద్రత లేనట్లే అని చెప్పి లేచి బయటకు వచ్చేశాడు. ఆయన చంద్ర భక్తికి కేంద్ర ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా, ప్రధాని మోడీ, సీఎం జగన్‌లు అలాగే నోరెళ్ళబెట్టారు.

### శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా
# విద్యార్థులకు పరీక్షా సామగ్రి



శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా ఈనెల 18న ఇరుగుళం జెడ్పి హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు వ్రాసేందుకు అవసరమైన జామెంట్రీ బాక్సు, ప్యాడ్, పెన్నులు వితరణగా అందచేశారు. పదవ తరగతి పరీక్షలను పురస్కరించుకుని బుధవారం ఈ స్కూల్లో సరస్వతి పూజ నిర్వహించగా, ఇందులో పాల్గొన్న ఫౌండేషన్ సిబ్బంది ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈ విద్యార్థులను ప్రోత్సహించేందుకు మూడు నెలల క్రితం ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను కూడా ఫౌండేషన్ ద్వారా అందించడం జరిగింది. దీంతోపాటు కరోనా వ్యాధి నివారణ పట్ల విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న శ్రీసిటీ ఎస్సై అరుణ్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు రోడ్డు భద్రత, ఈవ్ టీజింగ్, దిశా చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏటా విద్యార్థులను ప్రోత్సహిస్తూ స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రి అందిస్తున్న శ్రీసిటీ ఫౌండేషన్ చర్యలను ఇరుగుళం ప్రధానోపాధ్యాయులు బాబూలాల్ అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్నికల గోలకు విరామం



కరోనా వైరస్ ఎన్నికలను కూడా వదల్లేదు. ఈ వైరస్ కారణంగానే స్థానిక సంస్థల ఎన్నికలను ఆరు వారాల పాటు వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే! సుప్రీంకోర్టులో కూడా ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సమర్థించడంతో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగవని తేలిపోయింది. ఎన్నికల కోడ్ కూడా ఎత్తివేయడం జరిగింది. ఇంతవరకు జరిగిన ఎన్నికల ప్రక్రియను గమనిస్తే.. మొత్తం 46 జడ్పీటీసీలకుగాను 12 జడ్పీటీసీలు ఏకగ్రీవం అయ్యాయి. ఇక 34 జడ్పీటీసీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. 544 ఎంపీటీసీలకుగాను 188 ఎంపీటీసీలు ఏకగ్రీవమయ్యాయి, మిగిలిన 366 ఎంపిటిసిలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. జిల్లాలో నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీలు ఉండగా నెల్లూరు కార్పొరేషన్, గూడూరు, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలకు ఎన్నికలు ఆగిపోవడం తెలిసిందే! ఇక సూళ్లూరుపేట, వెంకటగిరి, ఆత్మకూరు, నాయుడుపేట మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అలాగే జిల్లా వ్యాప్తంగా 941 పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇప్పుడు ఏకగ్రీవంగా పదవులు పొందిన వారి పరిస్థితి హ్యాపీ, వాళ్లు ఇప్పుడు ప్రశాంతంగా ఉంటారు. కానీ నామినేషన్ వేసి పోటీలో ఉన్న వాళ్ళ పరిస్థితి మాత్రం కొంత ఇబ్బందికరంగా మారనుంది. ఎన్నికల తేదీ ఎప్పుడు ఉంటుందో తెలియదు. కరోనా వైరస్ ప్రభావం తగ్గితే గానీ ఎన్నికలు జరిపే అవకాశం లేదు. అప్పటిదాకా ఈ విషయం మీద కొంత టెన్షన్ ఉంటుంది. దానికితోడు ఆరోజు దాకా అనుచర గణాన్ని మేపాల్సి ఉంటుంది. ఇది ఎంతో కష్టంతో కూడుకున్న పని. పోటీలో ఉన్న అభ్యర్థులకు అప్పటిదాకా సినిమానే!

### కరోనా నుంచి ప్రజలను రక్షించాలని కోరుతూ..
# మృత్యుంజయ సహిత రుద్ర హోమం



కరోనా వైరస్ నుంచి ప్రజలను రక్షించాలని ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులను ప్రార్థిస్తూ ఈనెల 18న నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో మృత్యుంజయ సహిత రుద్రహోమాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వైఎస్సార్సీపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పి.రూప్‌కుమార్‌యాదవ్ ఈ రుద్రహోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ నుంచి ప్రజలను రక్షించాలని ఆ దేవదేవుణ్ణి కోరుకుంటూ విశేషపూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో హాయిగా ఉండాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎంతో విశిష్టమైన ఈ రుద్రహోమం నిర్వహించామన్నారు. భగవంతుడొక్కడే మృత్యుభయం నుంచి ప్రపంచాన్ని రక్షించగలడన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## మీ-సేవ కేంద్రాన్ని సీజ్ చేసిన సబ్‌కలెక్టర్

నెల్లూరు జిల్లా కోటలోని మహిళా జూనియర్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న మీ-సేవ కేంద్రాన్ని ఈనెల 17 న గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ, అధికారులు తనిఖీ చేశారు. మీ-సేవ కేంద్రం అందుబాటులో లేదని, జూనియర్ కళాశాలకు చెందిన భవనంలో మీ-సేవ కేంద్రాన్ని ఎలా నిర్వహిస్తారని, అద్దెకు ఎలా ఇస్తారంటూ సంబంధించిన పత్రాలను చూపలేదని సబ్ కలెక్టర్ సీజ్ చేశారు. ఎంపీడీవో భవాని, రెవిన్యూ సిబ్బంది, వైకాపా కేంద్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొడవలూరు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాలధర్మం
## వేమారెడ్డి కృష్ణవేణమ్మ



వేమారెడ్డి కృష్ణవేణమ్మ (90) ఈనెల 14వ తేదీన స్వర్గస్థులయ్యారు. ఆమె భర్త రంగారెడ్డి కొంతకాలం క్రితం చనిపోయారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వేమారెడ్డి వెంకటకృష్ణారెడ్డి 2003లో కాలం చేశారు. ఆయన ముత్తుకూరు మండలాధ్యక్షునిగా, ల్యాండ్ మార్టిగేజ్ బ్యాంక్ ఛైర్మెన్‌గా కూడా పనిచేశారు. రెండవ కుమారుడు వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి వైకాపా నాయకునిగా, తూర్పుకనుపూరు ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్‌గా పనిచేశారు. కృష్ణవేణమ్మ మృతికి విచారం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలుపుతోంది..'లాయర్'.

### వాహనదారులకు 31లోగా
## శాశ్వత రిజిస్ట్రేషన్లు

ప్రభుత్వ నిబంధనల మేరకు మార్చి నెల 31వ తేదీలోగా తాత్కాలిక రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాలన్నీ శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ సుబ్బారావు ఈనెల 16న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 11558 తాత్కాలిక వాహనాలు ఇంకా శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోనట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని, ఈనెల 31 తరవాత శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోని వాహనాలను తుక్కుగా పరిగణించాల్సి ఉంటుందని తెలిపారు.

## 31 వరకు టౌన్‌హాల్ మూత



నెల్లూరు నడి బొడ్డులో ఉన్న టౌన్‌హాలును ఈనెల 31 వరకు మూసివేయాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు ఆదేశాలు జారీచేశారు. కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా ఈ ఆదేశాలను టౌన్‌హాల్ నిర్వాహకులకు, ఇక్కడి ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవాల నిర్వాహకులకు ఈనెల 17న అందజేశారు. ఆ మేరకు త్యాగరాజ స్మరణోత్సవాలను నిలుపుదల చేస్తున్నట్లు ఉత్సవాల నిర్వాహకుడు యనమండ్ర నాగదేవిప్రసాద్ ప్రకటించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 31 వరకు టౌన్‌హాలును మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## పెట్రోలు ధరలు తగ్గించాలి

పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం కార్యవర్గ సభ్యులు పి.శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈనెల 16న నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్ ధరలను పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని దీనికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని కోరారు.

# కరోనా అవగాహన ర్యాలీ



ఈ నెల 16న నెల్లూరు నగరం 33వ డివిజన్‌లోని ఎన్‌బిటి కాలనీలో ఆ డివిజన్ వైసిపి ఇన్‌ఛార్జ్ బెజవాడ మేఘనాథ్‌సింగ్ ఆధ్వర్యంలో కరోనా అవగాహనా ర్యాలీ జరిగింది. స్థానిక అర్బన్‌హెల్త్ సెంటర్ నుండి నిర్వహించిన ర్యాలీలో డాక్టర్ సాయిసందీప్, ఏపిఎంఒ నాగరాజు, ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు. కరోనా వైరస్ సోకకుండా ప్రజలు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై ర్యాలీలో నినాదాల ద్వారా వినిపించారు.

## జర్నలిస్టులకు మాస్కులు..

నెల్లూరు ప్రెస్ క్లబ్ లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఈనెల 16 న కరోనా వైరస్ నివారణకు ముందు జాగ్రత్త చర్యలుగా జర్నలిస్టులకు మాస్కులు, హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యశోధర మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మాస్కులను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. హోమియో వైద్యులు మాధవ్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్, జిల్లా అధ్యక్షులు వి. వెంకటేశ్వర్లు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాస్క్‌ల పంపిణీ

కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ ఆధ్వర్యంలో ఈనెల 17న నెల్లూరు పప్పులవీధిలో ప్రజలకు మాస్క్‌ల పంపిణీ జరిగింది. ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని సంస్థ సభ్యులకు, వ్యాపారులకు, కూలీలకు, ప్రజలకు మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శి మంచికంటి శ్రీనివాసులు, అసోసియేట్ కార్యదర్శి సొల్లేటి వెలుగొండయ్య, పెంచల నరసింహస్వామి, పెసల సురేష్, కిషోర్ పాల్గొన్నారు.

## బాప్..రే. రైల్వే ప్లాట్ ఫాం టిక్కెట్ రూ.50

కరోనా వ్యాప్తిని అరికట్టే ఉద్దేశ్యంతో రైల్వే స్టేషన్లలో ప్లాట్ ఫారం టిక్కెట్ల ధరను రూ.10 ల నుంచి రూ.50 లకు పెంచుతున్నట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు ఈనెల 17 న ఒక ప్రకటన విడుదల చేశారు. దక్షిణ మధ్య రైల్వే స్టేషన్ల పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో రూ.50 లు, చిన్న స్టేషన్లలో రూ.10 నుంచి రూ.20 కు పెంచారు. పెరిగిన చార్జీలు ఈనెల 17 నుంచి అమలవుతాయని, కరోనాను నివారించేందుకు ప్రయాణీకులతో వచ్చే వారిని అరికట్టేందుకే రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## ఈ నెల 31దాకా సెలవులే

కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో విద్యాసంస్థలకు ఈ నెల 31వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. నెల్లూరుజిల్లాలో ఈ నెల 22వరకు రాష్ట్రప్రభుత్వం ఇంతకుముందే సెలవులు ప్రకటించి వుండగా, ఇప్పుడు కేంద్రప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో 31వ తేదీ వరకు ఈ సెలవులను పొడిగించాల్సి వచ్చింది. యూనివర్సిటీతో పాటు పి.జి సెంటర్లు, డిగ్రీ, పాలిటెక్నిక్, బి.ఇడి, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు, పాఠశాలలు అన్నీ 31దాకా మూతపడుతున్నాయి.

# కరోనాతో.. జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారింది. ఈరోజు ప్రపంచంలోని 195 దేశాలకు సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా విస్తరిస్తుందో, కరోనా వైరస్ అంతకంటే వేగంగా విస్తరిస్తోంది. రెండు నెలల క్రితమే కేవలం చైనాలోని వూహాన్ అనే నగరంలో పుట్టిన ఈ వైరస్ అతితక్కువ కాలంలోనే 165 దేశాలకు పాకింది. గ్లోబ్‌లో మిగిలి పోయిన దేశాలకు కూడా ఇది విస్తరించడానికి ఇక పెద్ద సమయం పట్టకపోవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 2లక్షలకుపైగా కరోనా కేసులు నమోదయ్యాయి. 9వేల మందిదాకా మరణించారు. ఇప్పుడు ఆసియా కంటే ఐరోపాలో కరోనా మృతుల సంఖ్య పెరుగుతోంది. చైనా తర్వాత ఇటలీ, ఇరాన్ దేశాలు కరోనా వైరస్ ప్రభావంతో అల్లాడుతున్నాయి. ఇటలీ అయితే 80ఏళ్ల పైబడిన కరోనా వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందించలేమని చేతులెత్తేసింది. వైరస్ పుట్టినిల్లయిన చైనాలో మాత్రం కేసులు తగ్గుతున్నాయి. ఆ దేశ ప్రజలలో అవగాహన, ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలు వైరస్‌ను నివారించడానికి దోహదపడ్డాయని చెప్పవచ్చు.

### ఆర్థిక వ్యవస్థ ఢమాల్

ఆయా దేశాల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆర్థిక వ్యవస్థల్లో కుదుపులు వస్తుంటాయి. కాని ఒక వైరస్ ఈరోజు ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే కుప్పకూల్చింది. మార్కెట్‌లు స్థంభించిపోయాయి. రవాణా వ్యవస్థ ఆగిపోయింది. లావాదేవీలు నిలిచిపోయాయి. కరోనా వైరస్ మూలంగా ప్రపంచం ఆర్థికంగా ఎంత నష్టపోయిందన్నది లెక్కలు వేసి తేల్చడానికి ఇంకొంత సమయం పట్టొచ్చు. ఇంతటి నష్టం చరిత్రలో ఎప్పుడూ లేదు.

### భారత్‌పై వైరస్ ప్రభావం

ప్రపంచంలో వున్న అతిపెద్ద మార్కెట్ వ్యవస్థల్లో భారత్ ఒకటి. కరోనా వైరస్ భారత ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. 130కోట్ల జనాభా వున్న భారతదేశంలో ఇంత వరకు 158 కోవిడ్-19 కేసులు నమోదు కాగా, మూడు మరణాలు నమోదయ్యాయి.

కోవిడ్-19 వైరస్ దేశంలో విస్తరించకుండా అడ్డుకోవడానికి భారత ప్రభుత్వం గట్టి చర్యలే తీసుకుంది. అన్ని విమానాశ్రయాలలో పకడ్బందీ చర్యల ద్వారా చాలా వరకు కేసులు పెరగకుండా అడ్డుకున్నారు. అన్ని రాష్ట్రాలలోనూ వైద్యశాఖలను అప్రమత్తం చేయడం, విదేశాల నుండి వచ్చిన వారిలో కరోనా లక్షణాలున్న వారిని పసిగట్టి ఐసోలేషన్, క్వరంటైన్ వార్డులకు తరలించి వైద్య చికిత్స అందించడం ద్వారా వైరస్ వ్యాప్తి చెందకుండా కొంత వరకు అడ్డుకున్నారు. ముఖ్యంగా ప్రజా సమూహాలను నిరోధించే చర్యలు తీసుకున్నారు. వైరస్ వ్యాప్తి చెందడానికి అవకాశమున్న అన్ని కోణాలను పరిశీలించి, తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు.

### నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే!

కోవిడ్-19 వైరస్‌ను నిర్లక్ష్యం చేస్తే ప్రపంచం పెనువిపత్తును ఎదుర్కోక తప్పదు. ఈ వైరస్ గాలిలో వ్యాప్తిచెందదు కాబట్టి ప్రపంచం కొంత వరకు ఊపిరి పీల్చుకుంది. అదే గాలిలో వ్యాపించే పనైతే ఇప్పటికే ప్రపంచం అల్లకల్లోలంగా మారుండేది. అయితే తగు జాగ్రత్తలు తీసుకోకుండా మనిషి రోజువారిలాగే జీవనం కొనసాగిస్తే వైరస్ అత్యంత వేగంగా వ్యాప్తిచెందుతుంది. కాబట్టి కొద్దిరోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజలే చైతన్యవంతులై, తమ జీవన విధానాలను నియంత్రించుకోవడం ద్వారా వైరస్‌ను అడ్డుకోవడానికి అవకాశం వుంటుంది.

### అవగాహనే ఔషదం

కరోనా వైరస్‌కు ఇంకా వ్యాక్సిన్ గాని, మందులు గాని లేవు. పారాసిటమాల్‌తో పాటు ఎయిడ్స్ నివారణలో వాడే మాత్రలను కరోనా వ్యాధిగ్రస్తులకు వాడుతున్నారు. అగ్రదేశాలు ఈ వైరస్‌కు వ్యాక్సిన్‌ను కనిపెట్టే పనిలో తీవ్రంగా నిమగ్నమై ఉన్నాయి. ఎంత వేగంగా ప్రయత్నించినా వ్యాక్సిన్ రావడానికి ఓ ఏడాది పట్టే అవకాశం ఉంది. అయితే ఈలోపు వైరస్ ఊరుకుంటుందా? విజృంభించకుండా ఉంటుందా? అది సాధ్యం కాదు. కాబట్టి కరోనా వైరస్‌ను నివారించడానికి మనదగ్గర ఏ ఆయుధం లేదు కాబట్టి... రాకుండా నిరోధించడమే మనముందున్న మార్గం. దీని కోసం ప్రజలు తమంతట తాముగా అవగాహన పెంపొందించుకోవాలి. వైరస్ రాకుండా నిరోధించాల్సిన చర్యల గురించి వైద్య ఆరోగ్య శాఖ సూచిస్తున్న జాగ్రత్తలను ప్రతిఒక్కరూ పాటించాల్సి ఉంది. సమూహంగా ఉండకపోవడం, చేతులు ఎప్పటికప్పుడు సుభ్రపరచుకోవడం, సాధ్యమైనంత వరకు ఇళ్ళకే పరిమితం కావడం, ప్రయాణాలు మానుకోవడం, దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు రుమాలును అడ్డుపెట్టుకోవడం, ఎక్కడ పడితే అక్కడ తాకకుండా ఉండడం, విదేశాల నుండి వచ్చిన వారిని గుర్తించి అధికారులకు తెలియజేయడం... ఇలా వైద్య ఆరోగ్య శాఖ సూచించిన జాగ్రత్తలు తీసుకుంటే కరోనాకు దూరంగా ఉండడం పెద్ద సమస్యేమీ కాదు.

### జనతా కర్ఫ్యూ విధించుకోండి

కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ వైరస్‌పై యుద్ధమే ప్రకటించారు. ప్రజా చైతన్యంతోనే ఈ వైరస్‌ను ఓడించగలమని ఆయన ఈ నెల 19వ తేదీ జాతినిద్దేశించి చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజలంతా కొద్దిరోజుల పాటు తమంతట తాము జనతా కర్ఫ్యూ విధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ దేశ ప్రజలు తన కోసం ఎన్నో ఇచ్చారని, ఎన్నో రోజులు తనకు వెచ్చించారని, ఈ దేశ ప్రజల సంక్షేమం కోసం తాను ఈరోజు వారి నుండి కొన్ని రోజులు కోరుతున్నానని, ఆ కొన్నిరోజుల పాటు వారు ఈ వైరస్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వీలైనంతవరకు ఇళ్ళకే పరిమితం కావాలని కోరారు. ఇది ప్రపంచ యుద్ధం కంటే ప్రమాదకరమైందని, ఈ వైరస్‌ను అంతమొందించే దాకా ప్రజలు తనకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఏపిలోనూ అప్రమత్తం

ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాష్ట్ర ప్రభుత్వం కరోనా వైరస్ నివారణ కోసం అప్రమత్త చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఇప్పటివరకు రెండు పాజిటివ్ కేసులు, ఒకటి నెల్లూరులో, రెండోది ఒంగోలులో నమోదయ్యాయి. నెల్లూరులో కరోనా బాధితుడు ఇప్పటికే కోలుకున్నాడు. కరోనా కేసులు పెరగకుండా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఈ నెల 31 వరకు అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. చరిత్రలో తొలిసారిగా తిరుమలలో దర్శనాలు నిలిపేశారు. ఇంకా పలు దేవాలయాల్లో దర్శనాలు నిలిపివేయడంతో పాటు ఉత్సవాలను కూడా నామమాత్రంగా చేయాలని ఆదేశించారు. మాల్స్, హాల్స్ వంటివన్నీ కొన్ని రోజులపాటు మూసేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

### దేశంలో అలర్ట్

దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీని విధించింది. ఈ నెల 29వ తేదీ దాకా కూడా అంతర్జాతీయ సరిహద్దులను మూసేస్తూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల విదేశాల నుండి ఈ దేశంలోకి వచ్చేవారు రావడం ఆగిపోతుంది. అన్ని రాష్ట్రాల్లో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టింది. పదేళ్ళలోపు పిల్లలను, 65ఏళ్లపైబడిన వృద్ధులను బయటకు పంపొద్దని సూచించింది.

### ఇటలీ.. పెద్ద గుణపాఠం

చరిత్రను పరిశీలిస్తే... ప్లేగు, కలరా, స్పానిస్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ వంటి ఎన్నో వైరస్‌లు ప్రపంచాన్ని అతలాకుతలం చేశాయి. గ్రామాలు గ్రామాలనే శవాల దిబ్బలుగా మార్చేశాయి. అయితే అప్పట్లో సాంకేతిక పరిజ్ఞానాలతో పాటు వైద్య సదుపాయాలు కూడా అంతంతమాత్రంగా ఉండేవి. కానీ ఇప్పుడు సాంకేతిక విజ్ఞానంతో పాటు ప్రజల్లో పరిజ్ఞానం పెరిగింది. ఒక వైరస్ ప్రబలిందంటే.. దాని నుంచి వచ్చే దుష్పరిణామాలను ఎదుర్కోవడానికి ప్రజలు అవగాహన తెచ్చుకుంటున్నారు. అయితే ఇంత విజ్ఞానం పెరిగిన కాలంలో కూడా యూరప్‌లోని ఇటలీ కరోనా వైరస్ ప్రభావంతో విలవిలలాడుతోంది. చైనా తర్వాత ఈ వైరస్ మూలంగా అతి ఎక్కువగా బాధపడుతున్న దేశం ఇటలీ. ఆ దేశంలో చైనాతో సమానంగా మరణాలు ఉన్నాయి. ఈ కరోనా మరణాల సంఖ్య కొద్దిరోజుల్లోనే చైనాను కూడా అధిగమించబోతోంది. అదీగాక బాధితులు ఆ దేశంలో రోజురోజుకీ వేలాదిగా పెరుగుతున్నారు. ఆ దేశం పూర్తి సంక్షోభంలో కూరుకుపోయింది. 80ఏళ్లు దాటిన వృద్ధులకు వైద్య చికిత్స అందించలేమంటూ చేతులెత్తేసింది. దీనికంతటికీ కారణం కరోనా వైరస్ విషయంలో ఆ దేశం అజాగ్రత్త చర్యలే! ఇటలీలో లక్షకుపైగా చైనా కార్మికులున్నారు. వాళ్ళ మూలంగానే అక్కడ కరోనా వైరస్ వ్యాపించింది. అయితే, ఆ దేశం కరోనా వైరస్‌ను నిర్లక్ష్యం చేసింది. ఇది మమ్మల్నేం చేస్తుందిలే అనుకుంది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. జనసమూహాలు ఉండే బార్లు, హాల్సు, మాల్సు వంటివాటిని యధావిధిగా కొనసాగించింది. కరోనా వైరస్‌పై ప్రజల్లో అవగాహన కూడా కల్పించలేదు. దీంతో వ్యాధి ఒకరి నుండి ఒకరికి సులభంగా పాకిపోయి ఈరోజు ఆ దేశంలో కరోనా వైరస్ బాధితులు వేలు దాటి లక్షల్లోకి పోతున్నారు. ఈ ఇటలీ ఉదంతాన్నే మనం ఒక గుణపాఠంగా తీసుకోవాలి. ఇండియా ఇంకో ఇటలీగా మారకుండా ఉండాలంటే ప్రజలే చైతన్యవంతులై ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ ఈ వైరస్‌పై సాగిస్తున్న యుద్ధంలో ఇండియాను విజేతగా నిలపాలి.

## నామినేషన్ ప్రక్రియలో...

# పోలీసుల తీరు దుర్మార్గం!

\- బీద రవిచంద్ర



నామినేషన్ ప్రక్రియలో అధికార పార్టీకీ అనుకూలంగా కొంతమంది పోలీసుల తీరు దుర్మార్గంగా ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర అన్నారు. ఈనెల16న టీడీపీ నాయకులు జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్‌ను ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విలేకర్లతో బీద రవిచంద్ర మాట్లాడుతూ పెళ్ళకూరు మండలం ఎంపీడీవో కార్యాలయానికి నామినేషన్ వేసేందుకు వెళ్ళిన తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్ధులను వైకాపా నాయకులు అడ్డుకొని నామినేషన్ వేయకుండా భయభ్రాంతులకు గురిచేశారని, మాజీ మంత్రి పరసా రత్నంను అడ్డుకుని కారు అద్దాలు పూర్తిగా ధ్వంసం చేసినా పోలీసుల్లో ఎలాంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. టీడీపీ నుంచి పోటీ చేసే అభ్యర్ధులను ఎన్నికల నుంచి తప్పుకోవాలని పోలీసులే బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. వైకాపా నాయకుల ఒత్తిడితో సీతారామపురం జడ్పీటీసీ అభ్యర్థి దంపతులను ఇంటి నుంచి తీసుకువచ్చిన ఉదయగిరి సీఐ, వైకాపా శాసనసభ్యుల ఇంట్లో వదిలిపెట్టి, నామినేషన్ విత్‌డ్రా అయ్యేలా ఒత్తిడికి గురిచేశారన్నారు. ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో హింసాపూరితమైన సంస్కృతిని తీసుకువస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు, సాక్ష్యాలు, ఆధారాలతో సహా ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ మేయరు అబ్దుల్ అజీజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, టీఎన్‌యస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు, అమృల్లా పాల్గొన్నారు.

# వాయిదా పడ్డ ఎలక్షన్

(మొదటి పేజీ తరువాయి)

వాయిదాపై టీడీపీ, బీజేపీ, జనసేనలు ఆనందించగా అధికార వైసిపి మాత్రం మండిపడింది. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అయితే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌పై బహిరంగంగానే నిప్పులు కక్కాడు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఎన్నికలను వాయిదా వేశాడని, మార్చి 31 లోపు ఎన్నికలు జరిగి పాలకవర్గాలు ఏర్పడకపోతే రాష్ట్రానికి రావాల్సిన 5వేల కోట్ల అభివృద్ధి నిధులు ఆగిపోతాయని ఆయన ఆవేదన చెందుతున్నాడు. అందుకే ఎన్నికల వాయిదా పక్షపాతంతో చేశారంటూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. ఎన్నికల వాయిదాపై సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. అయినా సుప్రీం కోర్టు కూడా ఎన్నికల కమిషన్ అభిప్రాయం వైపే మొగ్గు చూపడంతో అధికార పక్షానికి నిరాశే మిగిలింది.

### రాష్ట్రంలో అంతటి పరిస్థితి వుందా?

కరోనా వైరస్‌ను సాకుగా చూపి స్థానిక ఎన్నికలను ఎన్నికల కమిషనర్ వాయిదా వేశారు. కరోనా వైరస్ విపత్తు నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయడంలో అభ్యంతరం పెట్టాల్సిందేమీ లేదు. కాకపోతే వాయిదా వేసిన తీరే విమర్శలకు దారితీసింది. రాష్ట్రంలో ఎన్నికలను నిర్వహించలేనంతగా కరోనా వైరస్ ప్రమాదముందన్నది ఎలక్షన్ కమిషనర్‌కు ఎవరు చెప్పాలి... రాష్ట్ర ప్రభుత్వ, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఇతర అధికారులు చెప్పాలి. కాని కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వంతో ఈ విషయమై చర్చించకుండానే, అధికారులతో సమీక్ష చేయకుండానే తనకున్న విచక్షణాధికారాన్ని వాడుకుని ఎన్నికలను వాయిదా వేశాడు.

### వైసిపి ఊపుకు బ్రేక్!

చంద్రబాబు 14ఏళ్ళు సీఎంగా వుంటే ఆయన హయాంలో ఒక్కసారి మాత్రమే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. 2014లో అధికారంలోకి వచ్చాక కూడా నాలుగేళ్ళ పాటు స్థానిక సంస్థల ఎన్నికలు జరుగకుండా నెట్టుకొచ్చాడు. గత ఏడాది ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరిలో స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేయాలనుకున్నాడు. అయితే బీసీలకు పెంచిన రిజర్వేషన్‌లపై కోర్టుల్లో కేసులు వేయడంతో మార్చిలో స్థానిక ఎన్నికలను పెట్టుకోవాల్సి వచ్చింది. ఈ నెలలోనే జడ్పీటీసీ, ఎంపీటీసీలు, మున్సిపాల్టీలు, పంచాయితీల ఎన్నికలకు ముహూర్తాలు పెట్టేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నిక ప్రక్రియ మొదలై, రాష్ట్ర వ్యాప్తంగా నామినేషన్‌ల పర్వంలోనే వైసిపి హవా మొదలైంది. చరిత్రలోనే ఎప్పుడూ లేని సంఖ్యలో జడ్పీటీసీలు, ఎంపీటీసీలు వైసిపికి ఏకపక్షంగా ఏకగ్రీవం కాసాగాయి. ఇక మున్సిపాల్టీలలోనూ అదే పరిస్థితి ఏర్పడవచ్చు.

ఎన్నికలు జరిగినా 90శాతంపైగా స్థానాలు వైసిపి చేజిక్కించుకునే పరిస్థితి... దీనిని తట్టుకోలేకే ఎన్నికలు వాయిదా వేయించారన్న ఆరోపణలు కూడా వినవస్తున్నాయి.



## సింహపురికి వన్నె తెచ్చిన వనితలు

### పుస్తకాన్ని అందుకుంటున్న ప్రముఖులు


అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'లాయర్' వారపత్రిక ప్రతిష్టాత్మకంగా ప్రచురించి మార్చి 8, 2020న ఆవిష్కరించబడిన నెల్లూరు జిల్లాకు చెందిన మహిళామణుల విజయ ప్రస్థానాల సంకలనం 'సింహపురికి వన్నె తెచ్చిన వనితలు' కాఫీ టేబుల్ పుస్తకాన్ని అందుకుంటున్న ప్రముఖులు.

1. భారతీయ సినిమా గాయకులు శ్రీ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం
2. శాంతా బయోటెక్స్ ఛైర్మెన్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి
3. సుప్రసిద్ధ వైద్యరాజం డా॥ సి.యం.కె.రెడ్డి
4. మ్యాక్ సంస్థల ఛైర్మెన్ ఆదాల మురళీకృష్ణారెడ్డి
5. రెడ్డి ల్యాబ్స్ కో-ఛైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.ప్రసాద్‌రెడ్డి
6. భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్
7. వంశీరామ్ బిల్డర్స్ మేనేజింగ్ డైరెక్టర్ బి.సుబ్బారెడ్డి













# ఎయిర్ ఇండియాను అమ్మేస్తారా?

**- రాజ్యసభలో విపిఆర్**



ఎయిర్ ఇండియా యొక్క నాలుగు అనుబంధ సంస్థలను అమ్మడానికి కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్న మాట వాస్తవమా కాదా? అయితే దాని వివరాలు తెలియజేయాలని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరాడు. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఈ వారం రాజ్యసభలో జరిగిన చర్చల్లో ఆయన పలు అంశాలను ప్రస్తావించాడు. ఈ సందర్భంగా విపిఆర్ ఎయిర్ ఇండియా అమ్మకం గురించి మాట్లాడుతూ ముంబైలోని ఎయిర్ ఇండియా కార్పొరేట్ కార్యాలయ భవనాన్ని కూడా అమ్ముతున్నారన్న విషయం వాస్తవమా? అని ప్రశ్నించాడు. దీనికి కేంద్ర పౌరవిమానయాన మంత్రి హర్దీప్ సింగ్‌పురి సమాధానమిస్తూ 2017 జూన్ 28న జరిగిన సమావేశంలో ఎయిర్ ఇండియా లిమిటెడ్, దాని ఐదు అనుబంధ సంస్థల వ్యూహాత్మక పెట్టుబడులను పరిగణనలోకి తీసుకోవడానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందన్నాడు. అలాగే విపిఆర్ కాకినాడ - విశాఖ - శ్రీకాకుళం మధ్య ఏర్పాటు చేస్తున్న గ్యాస్ పైప్ ప్రాజెక్ట్ ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించాడు. కేంద్ర సహజ ఇంధన వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జవాబిస్తూ 391 కిలోమీటర్లు పొడవైన ఈ పైప్‌లైన్‌పై ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అధికారం ఇచ్చినట్లు చెప్పాడు. 2021 జూన్ 30కల్లా ఈ పనులు పూర్తి చేయాల్సి వుందని మంత్రి వివరించాడు. ఈ వారం సభలో విపిఆర్ రైతు ఉత్పత్తి సంస్థల ఏర్పాటు మీద, 2030నాటికి ఏర్పరచబోయే నీటి సంక్షోభం పైన స్పీడ్ ఫుడ్‌సేఫ్టీ ల్యాబ్‌ల ఏర్పాటుపైన ప్రశ్నలు వేసి సంబంధిత మంత్రుల ద్వారా సమాధానాలు రాబట్టాడు.

# కరోనాపై అశ్రద్ధ వద్దనే వద్దు

**- జిల్లా కలెక్టర్**
**ఎం.వి శేషగిరిబాబు**



కరోనా వైరస్‌పై అశ్రద్ధ వద్దని, ఆ వైరస్ నిరోధానికి ఎప్పటికప్పుడు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. విదేశాల నుంచి వచ్చినవారు కరోనా వైరస్ లక్షణాలు లేకున్నా అశ్రద్ధ చేయకూడదని, వారు స్వయంగా 14రోజుల పాటు హోమ్ ఐసొలేషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కరోనా వైరస్ (కోవిడ్-19) నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 19న నెల్లూరు, నూతన జడ్పీ కార్యాలయం ప్రాంగణంలోని డిఇఓసి నందు జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతిరాజ్, పురపాలక శాఖ, కార్మిక శాఖ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. విదేశీ పర్యటనలు ముగించుకుని ఇప్పటివరకు 800 మంది జిల్లాకు వచ్చారని కేంద్రప్రభుత్వం నుంచి సమాచారం ఉన్నదని, ఆశావర్కర్లు, ఏఎన్ఎం, స్థానిక పిహెచ్‌సి వైద్యులు వారి ఇళ్ళకు వెళ్ళి వారి ఆరోగ్య పరిస్థితిని గమనించాలని, ఆ నివేదికను జిల్లా కేంద్రంలోని అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతి సిబ్బంది, గ్రామ వలంటీర్లు, వార్డు వాలంటీర్ల ద్వారా గత 15రోజుల నుంచి జిల్లాకు విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలతో పాటు వచ్చే 15 రోజుల్లో విదేశాల నుంచి ఎవరైనా జిల్లాకు వచ్చే అవకాశం ఉందా అనే విషయాన్ని సేకరించాలని తెలిపారు.

రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంతో పాటు, అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వాలనే ఆదేశాలు ఖచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. జి.ఓ నం. 202లోని నిబంధనలు జిల్లాలోని అన్ని హోటల్స్, దుకాణ సముదాయాలు, సినిమాహాల్స్‌లోనూ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com